TGTEL/26/A2635
వాస్తవాలు పలుకు DD9 వార్త
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 111 | 03-08-2026 | గురువారం | పేజీలు: 08 | వెల: 3/-


2

## డీఎంకే హయాంలోని ఆ కేసులన్నీ వాపస్

- రైతులు, ఉపాధ్యాయులపై నమోదైన కేసుల ఎత్తివేతకు సీఎం విజయ్ ఆదేశం
- గత డీఎంకే ప్రభుత్వ హయాంలో నమోదైన కేసులు
- సిప్‌కాట్, పరందూర్ ఎయిర్‌పోర్ట్ నిరసనకారులకు ఊరట
- ప్రజల్లో విశ్వాసం పెంచేందుకే ఈ నిర్ణయమన్న సీఎం విజయ్
- నీట్, ఎన్ఎల్‌సీ నిరసనకారుల కేసులపైనా కొనసాగుతున్న డిమాండ్లు



## సావర్కర్‌కు ముస్లింలంటే ద్వేషం లేదు

- సావర్కర్‌కు ముస్లింల పట్ల ద్వేషం లేదని కోర్టుకు చెప్పిన సాత్యకి
- రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో సావర్కర్‌ను ముస్లింల ద్వేషిగా చిత్రీకరించారని ఆరోపణ
- లండన్‌లో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై సాత్యకి పరువునష్టం దావా

2


2

## ప్రజా వ్యతిరేక పాలనకు వెయ్యి రోజులు

- వెయ్యి రోజుల పాలన.. ప్రజా వ్యతిరేక విధానాలే
- పేదల బతుకులు బాగుపడిందేమీ లేదు
- హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్ల కూల్చివేత
- గురుకులాల్లో భద్రత కరువు.. విద్యార్థుల వరుస మరణాలు
- జాబ్ నోటిఫికేషన్లు లేక నిరుద్యోగుల ఆత్మహత్యలు
- మద్దతు ధర లేక అన్నదాతల బలవన్మరణాలు
- రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

## పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో జనసేన సేవా స్ఫూర్తి..

- జెండా ఆవిష్కరణ, భారీ బైక్ ర్యాలీ.. రోగులకు పండ్లు, పాలు పంపిణీ..


8


బీసీకి ఒక న్యాయం.. ఇతర సామాజికవర్గాలకు

# మరో న్యాయమా?

- ఖర్గేతో భేటీ అయిన మంత్రి కొండా సురేఖ
- అధిష్ఠానం పిలుపుతో ఢిల్లీకి వెళ్లిన మంత్రి
- కేసీ వేణుగోపాల్‌తో ఇంకా మాట్లాడలేదన్న సురేఖ
- అధిష్ఠానం నిర్ణయం కోసం వేచిచూస్తున్నట్లు వెల్లడి
- రాజీనామా చేయాలని ఎవరూ కోరలేదని స్పష్టీకరణ
- కేబినెట్‌లో ఇతర నేతలపై ఆరోపణలున్నాయని వ్యాఖ్య
- తనపై మాత్రమే చర్యలు ఎందుకని సురేఖ ప్రశ్న
- ఇప్పటికే ఖర్గే, రాహుల్, ప్రియాంకకు లిఖితపూర్వక ఫిర్యాదు
- సీఎం రేవంత్‌పై చర్యలు తీసుకోవాలని అధిష్ఠానానికి విజ్ఞప్తి
- పదేళ్లు తానే సీఎం అని ఎలా చెబుతారన్న సురేఖ

**ఢిల్లీ, (డిడి9 వార్త):**

కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పిలుపు రావడంతో ఢిల్లీ వెళ్లిన మంత్రి కొండా సురేఖ పార్టీ అగ్రనేతలను కలుస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో ఆమె సమావేశమయ్యారు. సమావేశం అనంతరం మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన సురేఖ.. ఖర్గేను కలిశానని తెలిపారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో మాత్రం ఇంకా మాట్లాడలేదని చెప్పారు. అధిష్ఠానం ఏం నిర్ణయం తీసుకుంటుందో వేచిచూస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. తనను రాజీనామా చేయాలని ఎవరూ కోరలేదని స్పష్టం చేశారు. తనపై వ్యవహరిస్తున్న తీరుపై సురేఖ ప్రశ్నలు మిగతా 2 లో..

## రక్షణ ప్రాజెక్టులకు భూమి

# ఇవ్వండి

- ఢిల్లీలో రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో ముఖ్యమంత్రి భేటీ
- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026కు ఆహ్వానం
- రక్షణ ఎక్స్‌పోలో భాగస్వాములు కావాలని కేంద్రానికి విజ్ఞప్తి
- దేవరకద్ర డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచిత భూమి కోరిన సీఎం
- ప్రాజెక్టు అవసరాలకు అనుగుణంగా భూకేటాయింపుపై చర్చ
- ఆదిలాబాద్ విమానాశ్రయ అభివృద్ధిపైనా రాజ్‌నాథ్‌తో చర్చ
- ఇప్పటికే 750 ఎకరాల భూసేకరణ చేపట్టినట్లు వెల్లడి
- మరో 750 ఎకరాలు సేకరించేందుకు రాష్ట్రం సిద్ధమని ప్రకటన
- రామ్మోహన్‌నాయుడితోనూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక భేటీ
- ఆదిలాబాద్, మామునూరు సహా ఇతర ఎయిర్‌పోర్టులపై చర్చ



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రులతో వరుసగా సమావేశమవుతూ రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. ఇందులో భాగంగా కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సమావేశమైన సీఎం.. తెలంగాణలో రక్షణ రంగానికి సంబంధించిన ప్రాజెక్టులకు సహకారం అందించాలని కోరారు. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026లో కేంద్ర రక్షణ శాఖ భాగస్వామి కావాలని విజ్ఞప్తి చేశారు.

**గ్లోబల్ సమ్మిట్‌కు రాజ్‌నాథ్‌కు ఆహ్వానం**

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న నేపథ్యంలో.. ఈ కార్యక్రమానికి రాజ్‌నాథ్‌సింగ్‌ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. సమ్మిట్‌లో భాగంగా నిర్వహించనున్న రక్షణ ఎక్స్‌పోలో కేంద్ర రక్షణశాఖ భాగస్వామిగా వ్యవహరించాలని కోరారు. తెలంగాణలో రక్షణ, ఏరోస్పేస్, సంబంధిత రంగాల్లో పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటుకు ఈ కార్యక్రమం ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం వివరించారు.

**దేవరకద్ర డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు భూమి**

దేవరకద్రలో ప్రతిపాదిత

# కాంగ్రెస్‌లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించబోను

- కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారన్న రాజ్‌గోపాల్ రెడ్డి
- నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరగదని వ్యాఖ్య
- వైఎస్సార్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానని వెల్లడి
- 'సీఎం.. సీఎం' అంటూ కార్యకర్తల నినాదాలపై కీలక వ్యాఖ్యలు
- 'ఆ సమయం వస్తే బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు' అని వ్యాఖ్య



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన కొందరు కాంగ్రెస్‌ను కబ్జా చేసి అధికారం చెలాయించాలని చూస్తున్నారని ఆరోపించారు. అలాంటి ప్రయత్నాలను తాను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు.

తెలంగాణలో వైఎస్ రాజశేఖర్ రెడ్డికి లక్షలాది మంది అభిమానులు ఉన్నారని రాజ్‌గోపాల్ రెడ్డి అన్నారు. తాము వైఎస్సార్ నిజమైన శిష్యులమని పేర్కొన్నారు. వైఎస్సార్ స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. రాజకీయాల్లో ఉన్నంత కాలం ఆయన ఆశయాల సాధన కోసం పనిచేస్తానని, వైఎస్సార్‌ను ఎప్పటికీ మరచిపోబోనని అన్నారు. ఎంతమంది కుట్రలు చేసినా, బెదిరింపులకు పాల్పడినా తాను భయపడేది లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌ను నమ్ముకున్న నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరగకుండా చూస్తానని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున 'సీఎం.. సీఎం' అంటూ నినాదాలు చేశారు. దీనిపై స్పందించిన రాజ్‌గోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 'నన్ను సీఎం.. సీఎం అని పిలుస్తున్నారు. ఆ సమయం గనక వస్తే.. దాన్ని బ్రహ్మదేవుడు మిగతా 2లో..

# 22ఏ భూములపై అసెంబ్లీలో చర్చిద్దాం

- బీఆర్ఎస్‌కు పొంగులేటి సవాల్
- 22ఏ అడ్డుపెట్టుకుని దందాలు చేస్తామంటే కుదరదని హెచ్చరిక
- అసెంబ్లీలో చర్చకు రావాలని బీఆర్ఎస్‌కు మంత్రి సవాల్
- ప్రతిపక్ష పాత్రను రెండు పార్టీలు విస్మరించాయని విమర్శ
- ఇందిరమ్మ రాజ్యం వెయ్యి రోజులు పూర్తి చేసుకుందని వెల్లడి
- కేసీఆర్ హయాంలో రూ.8.21 లక్షల కోట్ల అప్పులని ఆరోపణ
- గత ప్రభుత్వ అప్పులు, బకాయిలు తామే చెల్లిస్తున్నామని స్పష్టీకరణ
- యాస, భాషలతో ప్రజలను మభ్యపెట్టలేరని పొంగులేటి వ్యాఖ్య
- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ బకాయిలు చెల్లించామని వెల్లడి
- సర్పంచ్‌లకు బీఆర్ఎస్ పెట్టిన బకాయిలను కూడా తీర్చామని ప్రకటన
- హైదరాబాద్‌లో మీడియాతో చిట్‌చాట్‌లో మంత్రి కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

22ఏ భూముల అంశంపై అసెంబ్లీలో చర్చిద్దామని.. బీఆర్ఎస్ ఏం మాట్లాడాలనుకుంటే అది మాట్లాడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ చేశారు. 22ఏను అడ్డుపెట్టుకుని దందాలు చేయాలంటే కుదరదని హెచ్చరించారు. రెండు పార్టీలు ప్రతిపక్ష పాత్రను విస్మరించాయని



# మహిళలు పబ్లిక్‌లోకి వస్తే విధ్వంసమే

- మహిళలు ఇళ్లకే పరిమితం కావాలన్న ముఫ్తీ వ్యాఖ్యలపై దుమారం
- మహిళలపై ఆంక్షల భావజాలాన్ని అంగీకరించం
- 19వ శతాబ్దపు ఆలోచనలను వీడాలి
- ప్రజా జీవితంలో మహిళల భాగస్వామ్యమే ప్రగతిశీల వైఖరి
- ఇళ్లకే పరిమితం కావాల్సిన అవసరం మహిళలకు లేదు
- గ్రాండ్ ముఫ్తీ వ్యాఖ్యలు ఇస్లాం బోధనలకు ప్రతిరూపం కాదు
- ప్రవక్త భార్య వ్యాపారవేత్తగా ఉన్న విషయాన్ని గుర్తుచేసిన సతీషన్
- 'బ్యాటిల్ ఆఫ్ ది క్యామెల్'లో ఆయిషా కీలక పాత్ర




**నేషనల్‌బ్యూరో, (డిడి9 వార్త):**

మహిళలు ఇళ్లకే పరిమితం కావాలని ఇటీవల కేరళకు చెందిన గ్రాండ్ ముఫ్తీ కాంతపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. అయితే, ఈ వ్యాఖ్యలపై కేరళ సీఎం వీడీ సతీషన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల పబ్లిక్‌లోకి వస్తే "తీవ్ర విధ్వంసం" జరుగుతుందని ముస్లిం మతపెద్ద చేసిన వ్యాఖ్యలను తాము ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది మిగతా 2లో..

## కాంగ్రెస్ పాలనలో విధ్వంసం

# అవినీతి, అరాచకమే

- వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల
- అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- కాంగ్రెస్ మేనిఫెస్టో శతాబ్దపు అతిపెద్ద మోసమని ఆరోపణ
- పేదల భూముల వ్యవహారంలో 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపణ
- అభివృద్ధి లేకున్నా రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శ
- రుణమాఫీ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపణ
- 70 శాతం మంది రైతులకు అన్యాయం చేశారని కేటీఆర్ వ్యాఖ్య
- రైతుబంధు బంద్ చేసి రాహుల్ బంధు ప్రారంభించారని ఎద్దేవా
- ఉద్యోగాల హామీని అమలు చేయకుండా జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారని విమర్శ
- జలవాటాల్లో తెలంగాణకు అన్యాయం చేస్తే వదిలిపెట్టబోమని హెచ్చరిక



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో బీఆర్ఎస్ రూపొందించిన ఛార్జ్‌షీట్‌ను తెలంగాణ భవన్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి కంటే విధ్వంసం, అవినీతి, అరాచకమే పెరిగాయని ఆరోపించారు.

కాంగ్రెస్‌ది వెయ్యి రోజుల పాలన కాదని.. పీడన అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణలో జలద్రోహం చేస్తున్న జలగల పాలన కొనసాగుతోందని విమర్శించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ఈ శతాబ్దపు అతిపెద్ద మోసంగా అభివర్ణించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

భూముల వ్యవహారంలో కమీషన్ల ఆరోపణ

పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టి 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ పాలనలో అవినీతి విపరీతంగా పెరిగిందని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో చేపట్టకపోయినా ప్రభుత్వం రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేసిందని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతను 'ప్రా మ్యాక్స్'తో, అవినీతిని మిగతా 2లో..

# డీఎంకే హయాంలోని ఆ కేసులన్నీ వాపస్

- రైతులు, ఉపాధ్యాయులపై నమోదైన కేసుల ఎత్తివేతకు సీఎం విజయ్ ఆదేశం
- గత డీఎంకే ప్రభుత్వ హయాంలో నమోదైన కేసులు
- సిప్‌కాట్, పరందూర్ ఎయిర్‌పోర్ట్ నిరసనకారులకు ఊరట
- ప్రజల్లో విశ్వాసం పెంచేందుకే ఈ నిర్ణయమన్న సీఎం విజయ్
- నీట్, ఎన్ఎల్‌సీ నిరసనకారుల కేసులపైనా కొనసాగుతున్న డిమాండ్లు

**చెన్నై, (డిడి9 వార్త):**

తమిళనాడులో అధికారంలోకి వచ్చిన టీవీకే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గత డీఎంకే ప్రభుత్వ హయాంలో రైతులు, ఉపాధ్యాయులపై నమోదైన కేసులను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నట్లు ముఖ్యమంత్రి విజయ్ అసెంబ్లీలో ప్రకటించారు. ఈ నిర్ణయం ద్వారా నిరసనకారులకు భారీ ఊరట లభించినట్లయింది.

2021 మే నుంచి 2026 మధ్య కాలంలో అప్పటి ఎం.కె. స్టాలిన్ ప్రభుత్వం సిప్‌కాట్ పారిశ్రామిక వాడ, పరందూర్ విమానాశ్రయం వంటి ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసనలు తెలిపిన వారిపై అమానుషంగా వ్యవహరించిందని విజయ్ విమర్శించారు. ఆ సమయంలో రైతులు, ఉపాధ్యాయులపై పలు కేసులు నమోదు చేశారని, అవి ఇప్పటికీ పెండింగ్‌లో ఉండటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు.

ప్రజల న్యాయమైన డిమాండ్లకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తుందని విజయ్ స్పష్టం చేశారు. కేసుల ఎత్తివేత నిర్ణయం ప్రభుత్వ పాలనపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఇదిలా ఉండగా, 'నీట్'కు వ్యతిరేకంగా నిరసన తెలిపిన విద్యార్థులపై కేసులను ఉపసంహరించుకోవాలని సీపీఐ, ఎన్ఎల్‌సీ ఆందోళనకారులపై కేసులను రద్దు చేయాలని పీఎంకే పార్టీలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. అయితే, ఈ డిమాండ్లపై టీవీకే ప్రభుత్వం నుంచి ఇంకా ఎటువంటి స్పందన రాలేదు.

# సావర్కర్‌కు ముస్లింలంటే ద్వేషం లేదు

- సావర్కర్‌కు ముస్లింల పట్ల ద్వేషం లేదని కోర్టుకు చెప్పిన సాత్యకి
- రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో సావర్కర్‌ను ముస్లింల ద్వేషిగా చిత్రీకరించారని ఆరోపణ
- లండన్‌లో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై సాత్యకి పరువునష్టం దావా

**ఢిల్లీ, (డిడి9 వార్త):**

హిందుత్వ భావజాలవేత్త వినాయక్ దామోదర్ సావర్కర్‌కు ముస్లింలపై ఎన్నడూ ద్వేషం లేదని, పైగా వారి పురోభివృద్ధికి తన రచనల్లో దిశానిర్దేశం చేశారని ఆయన మనవడు సాత్యకి సావర్కర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన వ్యాఖ్యల ద్వారా సావర్కర్‌ను తీవ్ర ముస్లిం ద్వేషిగా చిత్రీకరించారని ఆయన ఆరోపించారు.

రాహుల్ గాంధీపై సాత్యకి దాఖలు చేసిన పరువునష్టం దావాకు సంబంధించి ప్రత్యేక కోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సాత్యకిని అడ్వకేట్ మిలింద్ పవార్ క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు.

2023లో లండన్‌లో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "సావర్కర్ తన ఐదారుగురు స్నేహితులతో కలిసి ఒక ముస్లిం యువకుడిపై దాడి చేసి ఆనందం పొందానని తన పుస్తకంలో రాసుకున్నారు" అని అన్నట్లు సాత్యకి గుర్తుచేశారు. ఈ వ్యాఖ్యల ద్వారా సావర్కర్‌ను ఒక మూకదాడికి పాల్పడే వ్యక్తిగా చూపారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

"ఈ మాటల వల్ల సావర్కర్‌ను తీవ్ర ముస్లిం వ్యతిరేకిగా చిత్రీకరించారు. కానీ ఆయనెప్పుడూ ముస్లింలను ద్వేషించలేదు. తన రచనల్లో వారి అభివృద్ధికి మార్గాలు సూచించారు" అని సాత్యకి కోర్టుకు వివరించారు. రాహుల్ గాంధీ పేర్కొన్నట్లుగా ముస్లిం యువకుడిపై దాడి జరిగిన ఘటన సావర్కర్ రాసిన ఏ పుస్తకంలోనూ లేదని ఫిర్యాదుదారు స్పష్టం చేశారు. ఈ కేసుకు సంబంధించి తదుపరి విచారణ కొనసాగుతోంది.

# 22ఏ భూములపై అసెంబ్లీలో చర్చిద్దాం

**మొదటిపేజీ తరువాయి**

ధ్వజమెత్తారు. బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.

తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వెయ్యి రోజులు పూర్తి చేసుకుందని పొంగులేటి తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. అప్పులతో పాటు అప్పటి ప్రభుత్వం పెట్టిన బకాయిలను కూడా తమ ప్రభుత్వమే చెల్లిస్తోందని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ నేతలు యాస, భాషలతో ప్రజలను మభ్యపెట్టలేరని మంత్రి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ బకాయిలను తమ ప్రభుత్వం చెల్లించిందని వెల్లడించారు. అలాగే బీఆర్ఎస్ హయాంలో సర్పంచ్‌లకు పెట్టిన బకాయిలను కూడా తామే చెల్లించామని పేర్కొన్నారు.

22ఏ భూముల అంశాన్ని అడ్డుపెట్టుకుని దందాలకు పాల్పడే ప్రయత్నాలను సహించేది లేదని పొంగులేటి స్పష్టం చేశారు. ఈ అంశంపై అసెంబ్లీ వేదికగా చర్చకు సిద్ధంగా ఉన్నామని, బీఆర్ఎస్ తన వాదనను అక్కడ వినిపించుకోవచ్చని సవాల్ చేశారు. ప్రతిపక్షాలు ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని మంత్రి వ్యాఖ్యానించారు.

# ప్రజా వ్యతిరేక పాలనకు వెయ్యి రోజులు

- వెయ్యి రోజుల పాలన.. ప్రజా వ్యతిరేక విధానాలే
- పేదల బతుకులు బాగుపడిందేమీ లేదు
- హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్ల కూల్చివేత
- గురుకులాల్లో భద్రత కరువు.. విద్యార్థుల వరుస మరణాలు
- జాబ్ నోటిఫికేషన్లు లేక నిరుద్యోగుల ఆత్మహత్యలు
- మద్దతు ధర లేక అన్నదాతల బలవన్మరణాలు
- రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు
- నేరాలు నిత్యకృత్యం కావడమే 'ప్రగతి'
- హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారు
- సొంత ప్రయోజనాలకే కాంగ్రెస్ సర్కారు ప్రాధాన్యం



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ వెయ్యి రోజుల కాలం పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలు, నెరవేర్చని హామీలతోనే సాగిందని ఆమె ధ్వజమెత్తారు.

గడిచిన వెయ్యి రోజుల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల బతుకులను బాగు చేసింది ఏమీ లేదని, కేవలం కొందరి సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చిందని మండిపడ్డారు. హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడం, సంక్షేమ గురుకులాల్లో భద్రత లేక విద్యార్థులు వరుసగా మరణించడం, జాబ్ నోటిఫికేషన్లు రాక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకోవడం, పంటలకు మద్దతు ధర లేక అన్నదాతల బలవన్మరణాలు పెరిగిపోవడం.. వీటికి తోడు రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించి నేరాలు నిత్యకృత్యం కావడమే ఈ ప్రభుత్వం సాధించిన అసలైన 'ప్రగతి' అని ఎద్దేవా చేశారు.

ఉద్యమకారుల నెత్తురు చిందిన నాటి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, ఈ సర్కార్ కాలం చెల్లిపోయిందని హెచ్చరించారు. ప్రభుత్వ అరాచకాలను, ప్రజా వ్యతిరేక విధానాలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని, ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడి చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో తెలంగాణలో మళ్లీ ప్రజల ప్రభుత్వమే అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

# రక్షణ ప్రాజెక్టులకు భూమి ఇవ్వండి

**మొదటిపేజీ తరువాయి**

డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సీఎం కోరారు. ప్రాజెక్టు ఏర్పాటుతో రక్షణ రంగంలో తెలంగాణకు మరింత ప్రాధాన్యం లభించే అవకాశం ఉందని, దీనికి అవసరమైన సహకారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రికి వివరించారు.

**ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుపైనా చర్చ**

రాజ్‌నాథ్‌సింగ్‌తో జరిగిన సమావేశంలో ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించిన అంశం కూడా చర్చకు వచ్చింది. విమానాశ్రయ అభివృద్ధికి అవసరమైన భూసేకరణపై సీఎం వివరాలు వెల్లడించారు. ఇప్పటికే 750 ఎకరాల భూమిని సేకరించే ప్రక్రియ చేపట్టినట్లు** తెలిపారు. అవసరమైతే మరో 750 ఎకరాల భూమిని సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ప్రాంతీయ విమాన రాకపోకలకు, అభివృద్ధికి ఉపయోగకరంగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

**రామ్మోహన్‌నాయుడితో విమానాశ్రయాలపై చర్చ**

అనంతరం కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. తెలంగాణలో విమానాశ్రయాల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఇరువురు చర్చించారు. ముఖ్యంగా ఆదిలాబాద్, మామునూరు విమానాశ్రయాలతో పాటు రాష్ట్రంలోని ఇతర ఎయిర్‌పోర్టుల అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు.

ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించిన భూసేకరణ, మామునూరు విమానాశ్రయం అభివృద్ధి తదితర అంశాలపై కేంద్ర పౌరవిమానయాన శాఖ నుంచి సహకారం అందించాలని రేవంత్‌రెడ్డి కోరినట్లు సమాచారం.



ఈ సమావేశాల్లో రాష్ట్రానికి సంబంధించిన రక్షణ, పౌరవిమానయాన రంగాల ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అవసరమైన అనుమతులు, సహకారం పొందడంపై ముఖ్యమంత్రి ప్రధానంగా దృష్టి పెట్టారు. సీఎం వెంట మంత్రి వివేక్, ఎంపీలు మల్లు రవి, బలరామ్ నాయక్, అనిల్ యాదవ్ తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్‌లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించబోను

**మొదటిపేజీ తరువాయి**

కూడా ఆపలేదు' అని అన్నారు.

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకొచ్చి 'రాజన్న రాజ్యం' కొనసాగిస్తామని రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో విధ్వంసం
# అవినీతి, అరాచకమే

**మొదటిపేజీ తరువాయి**

'అల్ట్రామ్యాక్స్'తో, అరాచకాన్ని 'ఐమ్యాక్స్'తో పోల్చుతూ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను కుక్కలు చింపిన విస్తరిలా తయారు చేసిందని మండిపడ్డారు.

**రుణమాఫీపై ప్రభుత్వాన్ని నిలదీసిన కేటీఆర్**

రైతుల రుణమాఫీ విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి.. కేవలం రూ.20 వేల కోట్ల మేరకు మాత్రమే చేశారని ఆరోపించారు. రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్టు పెట్టారని గుర్తుచేశారు.

అయితే పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండానే 70 శాతం మంది రైతులకు కుచ్చుటోపీ పెట్టారని కేటీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణను దేశానికే అన్నపూర్ణగా మార్చామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పరిస్థితిని నాశనం చేసిందని అన్నారు. రాష్ట్రంలో దరిద్రం దండయాత్ర మొదలై వెయ్యి రోజులు అయిందని వ్యాఖ్యానించారు.

**'ఢిల్లీకి మూటలు.. పదవుల కోసం కీచులాటలు'**

కాంగ్రెస్ పాలనలో ఢిల్లీకి మూటలు, పదవుల కోసం కీచులాటలు తప్ప మరేమీ లేదని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు పథకాన్ని నిలిపివేసి 'రాహుల్ బంధు' ప్రారంభించారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర సంపదను కొల్లగొట్టే విషయంలో ముఖ్యమంత్రి, మంత్రులు పరస్పరం పోటీ పడుతున్నారని ఆరోపించారు.

గోదావరి, కృష్ణా జలాల వాటాల్లో తెలంగాణకు అన్యాయం జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని కేటీఆర్ హెచ్చరించారు. రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటే బీఆర్ఎస్ తరఫున పోరాడుతామని అన్నారు.

**కాళేశ్వరంపై కక్ష.. రైతులకు శిక్ష**

కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ప్రాజెక్టు విషయంలో తీసుకుంటున్న నిర్ణయాల ప్రభావాన్ని రైతులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

మిస్ వరల్డ్ పోటీలు, మెస్సీ కార్యక్రమాల కోసం భారీగా నిధులు ఖర్చు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రైతులకు సాగునీరు అందించేందుకు మాత్రం డబ్బులు ఖర్చు చేయడం లేదని విమర్శించారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆరోపించారు.

**ఉద్యోగాల హామీపై విమర్శలు**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. ఉద్యోగాల భర్తీ విషయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో 'జాబ్‌లెస్ క్యాలెండర్' ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో రాహుల్‌గాంధీతో కలిసి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు.. తెలంగాణలో మాత్రం నిరుద్యోగులపై దాడులు చేయిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా వారిపై ఆంక్షలు, కేసులు, దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి స్పందన రావాల్సి ఉంది. ఈ సమావేశంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

## బీసీకి ఒక న్యాయం.. ఇతర సామాజికవర్గాలకు
# మరో న్యాయమా?

**మొదటిపేజీ తరువాయి**

సంధించారు. బీసీ అయిన తనకు ఒక న్యాయం, ఇతర సామాజికవర్గాలకు మరో న్యాయం పాటిస్తారా? అని ఆమె నిలదీశారు. కేబినెట్‌లోని ఇతర సామాజికవర్గాల నేతలపై కూడా పెద్దఎత్తున ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆ ఆరోపణలపై ఏం సమాధానం చెబుతారని, వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు.

తనకు సంబంధించిన అంశాలతో పాటు ఇతర విషయాలపై ఇప్పటికే కాంగ్రెస్ అధిష్ఠానంలోని కీలక నేతలకు రాతపూర్వకంగా వివరించినట్లు సురేఖ తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా అధిష్ఠాన పెద్దలందరికీ విషయాలను తెలియజేసినట్లు చెప్పారు.

ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డిపై అధిష్ఠానం



చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేసినట్లు తెలిపారు. పదేళ్లు తానే సీఎం అని రేవంత్‌రెడ్డి ఎలా చెబుతారు? అని సురేఖ ప్రశ్నించారు. తాను ప్రస్తావించిన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ఖర్గేను కోరినట్లు వెల్లడించారు.

# మహిళలు పబ్లిక్‌లోకి వస్తే విధ్వంసమే

**మొదటిపేజీ తరువాయి**

లేదని స్పష్టం చేశారు. "మహిళలు పబ్లిక్‌లోకి వస్తే తీవ్ర నష్టం జరుగుంది. మహిళలు విధేయులుగా ఇళ్లలోనే ఉండాలని ఖురాన్ చెబుతోందని ఆయన చేసిన వ్యాఖ్యలతో తాము ఏకీభవించం. మా ప్రభుత్వం కానీ, మా పార్టీ కానీ ఈ వైఖరికి మద్దతు ఇవ్వదు" అని సతీషన్ అన్నారు.మహిళలు సమాజంలోని అన్ని రంగాల్లో ఉండాలన్నదే తమ ప్రగతిశీల వైఖరి అని కేరళ సీఎం అన్నారు. మహిళలు అణచివేతకు లోనై ఇళ్లకే పరిమితం కావాలన్న భావన 19వ శాతాబ్ధపు ఆలోచన అని అన్నారు. మహిళలు విధేయులుగా ఇళ్లలోనే ఉండాల్సిన అవసరం లేదని, వారు ప్రజా జీవితంలో, సామాజిక జీవితంలో అన్ని రంగాల్లో చురుకుగా పాల్గొనాలని అన్నారు. గ్రాండ్ ముఫ్తీ వ్యాఖ్యలు ఇస్లాం బోధనలకు సరైన ప్రతిరూపం కాదని సతీషన్ అన్నారు. ప్రవక్త మహమ్మద్ తొలి భార్య ప్రముఖ వ్యాపారవేత్త అని, ఆయిషా 'బ్యాటిల్ ఆఫ్ ది క్యామెల్'లో



కీలక పాత్ర పోషించారని, రాణి బిల్కిస్ ఒక పాలకురాలిగా ఉన్నారని గుర్తుచేశారు.

గ్రాండ్ ముఫ్తీ వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ స్పందించారు. మత పెద్ద ఆదేశాలతో కేరళలోని బాలికలను మధ్యయుగపు నిర్బంధంలోకి నెట్టలేరని అన్నారు. కాంగ్రెస్, సీపీఎంలు బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ఈ అంశంపై రాహుల్ గాంధీ మౌనం వహించడాన్ని ఆయన ప్రశ్నించారు. మహిళలు పితృస్వామ్య భావజాలాన్ని వ్యతిరేకించాలని చెబుతున్న రాహుల్ గాంధీ, గ్రాండ్ ముఫ్తీ వ్యాఖ్యల్ని ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు.

# వైఎస్సార్ పాలనకు ప్రతిపక్షాల ప్రశంసలు!

- ఆరోగ్యశ్రీ.. ఫీజు రీయింబర్స్‌మెంట్.. జలయజ్ఞంతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నేత
- రామగుండంలో ఘనంగా వైఎస్సార్ వర్ధంతి.. నివాళులర్పించిన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

**పెద్దపల్లి బ్యూరో, సెప్టెంబరు 02 (డీడీ9 వార్త):**

దివంగత నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ నాయకుడు మెంటం ఉదయ్‌రాజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్‌ఠాకూర్ హాజరై వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ.. వైఎస్సార్ పాలన ప్రజా సంక్షేమం, రైతుల అభ్యున్నతి, పేద విద్యార్థుల భవిష్యత్తును కేంద్రంగా చేసుకుని సాగిందన్నారు. ఆయన పరిపాలనను ప్రతిపక్ష నాయకులు సైతం మెచ్చుకునే స్థాయిలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారని గుర్తుచేశారు.

ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం కల్పించారని తెలిపారు.

జలయజ్ఞం ద్వారా సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిస్తూ రైతుల పొలాలకు నీరందించేందుకు కృషి చేసిన రైతు పక్షపాతి వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ప్రజానుకూల నిర్ణయాలు నేటికీ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు.

వైఎస్సార్ జ్ఞాపకార్థం రామగుండం పట్టణంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఖాళీ స్థలాన్ని చూపించాలని నగర మేయర్ మహంకాళి స్వామిని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ కోరారు. రామగుండంలో వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్లు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.










# చిన్నారుల చిరునవ్వుకు.. దంత పరీక్షలు!

- **మార్కండేయ కాలనీలోని శ్రీ లిటిల్ జీనియస్ ప్లే స్కూల్‌లో ఉచిత డెంటల్ చెకప్**

**పెద్దపల్లి బ్యూరో, సెప్టెంబరు 02 (డీడీ9 వార్త):**

స్థానిక మార్కండేయ కాలనీలోని శ్రీ లిటిల్ జీనియస్ ప్లే స్కూల్‌లో బుధవారం విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. శ్రీకాంత్ డెంటల్ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో చిన్నారులకు దంత పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థుల దంత ఆరోగ్యాన్ని పరిశీలించి, నోటి పరిశుభ్రత, దంతాల సంరక్షణపై అవసరమైన సూచనలు అందించారు. చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాంత్ డెంటల్ సిబ్బందితో పాటు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.






# 420 హామీలు.. ప్రశ్నిస్తున్న రామగుండం!

- **8 ఇంక్లైన్ కాలనీలో కాంగ్రెస్ కార్పొరేటర్లకు వినతిపత్రాలు**
- **హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని సోమారపు లావణ్య ధ్వజం**

**పెద్దపల్లి బ్యూరో, సెప్టెంబరు 02 (డీడీ9 వార్త):**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలుపై బీజేపీ రాష్ట్ర నాయకురాలు సోమారపు లావణ్య ఆధ్వర్యంలో 'ప్రశ్నిస్తున్న రామగుండం' కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ వారం రోజుల కార్యాచరణలో భాగంగా రామగుండం నియోజకవర్గంలోని 8 ఇంక్లైన్ కాలనీలో ఈ కార్యక్రమం చేపట్టారు.

స్థానిక కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికైన 14వ డివిజన్ కార్పొరేటర్ బడావాత్ శంకర్‌నాయక్, 17వ డివిజన్ కార్పొరేటర్ అనుము స్వరూప, 18వ డివిజన్ కార్పొరేటర్ దేవనపల్లి చక్రపాణి, 19వ డివిజన్ కార్పొరేటర్ మారెల్లి సుశీలకు బీజేపీ నాయకులు వినతి పత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా సోమారపు లావణ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా ప్రజలను నిరాశకు గురిచేస్తోందని ఆరోపించారు. రైతు భరోసా, రుణమాఫీ, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, తులం బంగారం, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య పింఛన్ల పెంపు వంటి హామీలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని పేర్కొన్నారు. 420 హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ వైఖరిని ప్రజల్లో ఎండగట్టేందుకే 'ప్రశ్నిస్తున్న రామగుండం' కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

ప్రజా సమస్యలపై కౌన్సిల్ సమావేశాల్లో కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రభుత్వాన్ని నిలదీయాలని బీజేపీ నాయకులు కోరారు. 8 ఇంక్లైన్ కాలనీలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కార్పొరేటర్లు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.

కార్యక్రమంలో మాజీ జిల్లా ఉపాధ్యక్షురాలు మాతంగి రేణుక, సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ దాసరి శ్రీనివాస్, సుశీల, నాయకులు కన్నూరి భాస్కర్, కొమ్మ శ్రీనివాస్‌యాదవ్, అరిగేలా శ్రావణ్‌యాదవ్, పొట్ల వెంకటేష్, మారేపల్లి శ్రీనివాస్, అంకం కుమార్, పంగ రవి, బోటుకు మల్లేష్, పొట్ల శశాంక్, మెరుగు శ్రీనివాస్, రాజేష్‌నాయక్, నాగేందర్, ఎడ్లపురం రమేష్, నారీ, కుందారపు సత్యనారాయణ, ఇల్లందుల మహేష్, భాస్కర్, క్రాంతి, పొట్ల సాయితేజ, శాంతిరాజ్, వివేక్, సాయికుమార్, మహిళా నాయకురాళ్లు పానుగంటి అంజలి, కరుపాకుల మాధవి తదితరులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీశైల జగద్గురు డా. చెన్న సిద్దారమ ని మర్యాదపూర్వకంగ కలిసిన పెద్దపల్లి ఎమ్మెల్యే.

**డిడి9వార్త / పెద్దపల్లి సెప్టెంబర్ 3:**

ఓదెల శ్రీ. మల్లికార్జున స్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా బుధవారం రోజున శ్రీశైల ఆలయ సందర్శనలో భాగంగా తెలంగాణ దేవాలయ శాఖ స్థపతి వల్లినయాగన్ తో కలిసి శ్రీశైల జగద్గురు డా. చెన్న సిద్దరామ పండితారాధ్య భగవత్పదులు ని మర్యాదపూర్వకంగా కలిసి వారికి ఓదెల మల్లన్న ఆలయం యొక్క మాస్టర్ ప్లాన్ను క్షుణ్ణంగా వివరించిన ప్రభుత్వవిప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.తదుపరి శ్రీశైల జగద్గురు డా. చెన్న సిద్దరామ పండితారాధ్య భగవత్పదులు ప్రభుత్వవిప్ ఎమ్మెల్యే విజయరమణ రావు ని ఆశీర్వదించారు.. ఈ కార్యక్రమంలో ఓదెల మల్లన్న ఆలయ ఈ.వో, ప్రధాన అర్చకులు మరియు తదితరులు పాల్గొన్నారు.



# భూగర్భ గనులు ప్రైవేటుపరం చేయడం లేదు!

- **వార్తలు పూర్తిగా అవాస్తవం**
- **శాంతిఖని ఈఓఐ ప్రక్రియ కూడా విరమణ.. సింగరేణి యాజమాన్యం స్పష్టీకరణ**

**పెద్దపల్లి బ్యూరో, సెప్టెంబరు 02 (డీడీ9 వార్త):**

సింగరేణి భూగర్భ బొగ్గు గనులను ప్రైవేటుపరం చేస్తున్నట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని సింగరేణి యాజమాన్యం స్పష్టం చేసింది. భూగర్భ గనులను ప్రైవేటీకరించే ప్రతిపాదన ప్రస్తుతం సంస్థ పరిశీలనలో ఏదీ లేదని తేల్చి చెప్పింది.

బాధ్యతాయుతమైన ప్రభుత్వ రంగ సంస్థగా సింగరేణి ప్రస్తుతం 21 భూగర్భ, 17 ఓపెన్‌కాస్ట్ గనుల ద్వారా బొగ్గు ఉత్పత్తి చేస్తోందని తెలిపింది. తెలంగాణతో పాటు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు బొగ్గు సరఫరా చేస్తూ దేశ ఇంధన భద్రత, పారిశ్రామిక అభివృద్ధికి సంస్థ నిరంతరం తోడ్పడుతోందని పేర్కొంది.

సింగరేణిలోని కొన్ని భూగర్భ గనులు ఆర్థికంగా నష్టాల్లో ఉన్నప్పటికీ.. తెలంగాణ ప్రాంతంలో ఉపాధి, ఉద్యోగ భద్రతను దృష్టిలో ఉంచుకుని వాటిని కొనసాగిస్తున్నట్లు యాజమాన్యం వెల్లడించింది.

గనులను మూసివేయడం లేదా ప్రైవేటుపరం చేయడం తమ ఉద్దేశం కాదని.. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, నిర్వహణ వ్యయాలను తగ్గించడం ద్వారా సాధ్యమైనన్ని గనులను లాభదాయకంగా మార్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపింది.

భారీ నష్టాల్లో కొనసాగుతున్న శాంతిఖని భూగర్భ గనిలో ఎండీఓ విధానంలో ఉత్పత్తి నిర్వహిస్తే వ్యయాలు తగ్గుతాయా? నష్టాలను నివారించవచ్చా? అనే అంశాలను అధ్యయనం చేసేందుకే పైలట్ ప్రాజెక్టుగా ప్రతిపాదన రూపొందించినట్లు సింగరేణి వివరించింది.

ఇందులో భాగంగా జనవరి 2న ఈఓఐ ప్రకటన జారీ చేసి ఆసక్తిగల సంస్థల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానించినట్లు తెలిపింది. తొలుత జనవరి 15 వరకు గడువు ఇచ్చినా ఏ సంస్థా ఆసక్తి చూపలేదని, అనంతరం గడువును జనవరి 22 వరకు పొడిగించగా ఒక సంస్థ మాత్రమే ముందుకొచ్చిందని పేర్కొంది.

అయితే తదుపరి దశలో ఆ సంస్థ కూడా ప్రక్రియలో కొనసాగేందుకు సంసిద్ధత వ్యక్తం చేయలేదని, తగిన స్పందన రాకపోవడంతో ఆ ప్రతిపాదనను విరమించుకున్నట్లు యాజమాన్యం స్పష్టం చేసింది.

శాంతిఖని గనికి సంబంధించి జారీ చేసిన ఈఓఐని ఆధారంగా చేసుకుని సింగరేణి భూగర్భ గనులను ప్రైవేటుపరం చేస్తోందని ప్రచారం చేయడం వాస్తవ విరుద్ధమని యాజమాన్యం పేర్కొంది. శాంతిఖని ఈఓఐ ప్రక్రియను ఇప్పటికే విరమించుకున్నామని స్పష్టం చేసింది.

భూగర్భ గనులను మరింత సమర్థంగా నిర్వహించడం, నష్టాలను తగ్గించడం, సాధ్యమైనన్ని గనులను లాభదాయకంగా మార్చడం ద్వారా తెలంగాణలో ప్రస్తుత ఉపాధి అవకాశాలను పరిరక్షించడంతో పాటు భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపింది.




వాస్తవాలను నిర్ధారించుకోకుండా ఇటువంటి వార్తలను ప్రచారం చేయడం వల్ల సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబాలు, ప్రజల్లో అనవసర ఆందోళన ఏర్పడే అవకాశం ఉందని యాజమాన్యం పేర్కొంది.

# మహానేతకు ఘన నివాళి!

- **వైఎస్సార్ ప్రతి గుండెలో చిరంజీవి**
- **రామగిరిలో ఘనంగా 17వ వర్ధంతి కార్యక్రమం**
- **ఆరోగ్యశ్రీ, 108 సేవలతో ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర: తొట్ల తిరుపతి యాదవ్**

**పెద్దపల్లి బ్యూరో, సెప్టెంబరు 02 (డీడీ9 వార్త):**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి కార్యక్రమాన్ని రామగిరి మండలంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు బుధవారం బేగంపేట్ ఎక్స్‌రోడ్‌లోని మంథని బ్లాక్ కాంగ్రెస్ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రొడ్డ బాపన్న పటేల్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ పార్టీ శ్రేణులతో కలిసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 'వైఎస్సార్ అమర్ రహే' అంటూ నినాదాలు చేశారు.

పాదయాత్రలో ఆయనతో నడవడం అదృష్టం

ఈ సందర్భంగా తొట్ల తిరుపతి యాదవ్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో వైఎస్సార్ చేపట్టిన చారిత్రాత్మక పాదయాత్రను గుర్తుచేసుకున్నారు. సిరిసిల్ల ప్రాంతంలో జరిగిన పాదయాత్రలో తాను, ప్రస్తుత మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొనడం గర్వకారణమన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ వైఎస్సార్ అహర్నిశలు శ్రమించి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని పేర్కొన్నారు.

పేదల పాలిట సంజీవనిగా నిలిచిన ఆరోగ్యశ్రీ, అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడిన 108 అంబులెన్స్ సేవలు వైఎస్సార్ మానసపుత్రికలని తిరుపతి యాదవ్ అన్నారు. ఈ సంక్షేమ పథకాలే ఆయనను ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిపాయని పేర్కొన్నారు.

వైఎస్సార్ అకాల మరణం రాష్ట్ర ప్రజలను తీవ్ర విషాదానికి గురిచేసిందని, ఆయన మరణాన్ని తట్టుకోలేక అనేక కుటుంబాలు కన్నీరుమున్నీరైన విషయాన్ని గుర్తుచేశారు.

వైఎస్సార్ మరణానంతరం తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవించి ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని తిరుపతి యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో పనిచేయడం ప్రతి కార్యకర్త గర్వంగా భావించాలన్నారు. రాబోయే రోజుల్లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయాలని, కాంగ్రెస్ శ్రేణులంతా ఏకతాటిపై నిలిచి ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, గ్రామాల సర్పంచులు, తదితరులతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.








# వెయ్యి రోజుల పాలన.. హామీలపై పోరుబాట!

- **గోదావరిఖనిలో బీఆర్ఎస్ నిరసన.. 420 అడుగుల ఫ్లెక్సీ ప్రదర్శన**
- **మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా.. బాకీ కార్డుల పంపిణీ**
- **హామీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాడతాం: వ్యాల్ల హరీష్‌రెడ్డి**

**పెద్దపల్లి బ్యూరో, సెప్టెంబరు 02 (డీడీ9 వార్త):**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తయినా ఎన్నికల హామీలను అమలు చేయలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు వారం రోజులపాటు నిర్వహిస్తున్న ఆందోళనల్లో భాగంగా బుధవారం గోదావరిఖనిలో నిరసన తెలిపారు.

స్థానిక మెయిన్ చౌరస్తాలో 420 అడుగుల భారీ ఫ్లెక్సీని ప్రదర్శించారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ 'బాకీ కార్డులు' ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.



ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేస్తామని చెప్పిందన్నారు. అయితే 1,000 రోజులు పూర్తయినా వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు.

రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై వ్యక్తిగత విమర్శలకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.



రామగుండం నియోజకవర్గంలోనూ ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని హరీష్‌రెడ్డి ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రజా సమస్యలపై ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టిస్తూ, కూచివేతలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

రామగుండం ప్రాంత అభివృద్ధి విషయంలో ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

రాబోయే ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు ఏకమై కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హరీష్‌రెడ్డి అన్నారు. ప్రజా వ్యతిరేక పాలనకు చరమగీతం పాడతారని పేర్కొన్నారు.

కార్యక్రమంలో మిరియాల రాజిరెడ్డి, కోరుకంటి చందర్, కౌశిక హరినాథ్, మూల విజయరెడ్డి, ఫ్లోర్‌లీడర్ మేకల సమ్మన్న, మాజీ కోఆప్షన్ సభ్యురాలు తస్లీమ్‌భాను, నడిపెల్లి మురళీధర్‌రావు, కర్క పద్మజ, రమేష్, కిషన్‌రెడ్డి, జహీద్‌భాషా, శివకుమార్, బక్కి కిషన్, బూరుగు వంశీకృష్ణ, చొప్పరి శ్రీనివాస్, నటుపల్లి శ్రీనివాస్, ఈదునూరి శ్రీకాంత్, రంగు దుర్గాప్రసాద్, అనిల్‌రావు, కళావతి, పర్శ స్వాతి, ఉదయ్, మేడం సతీష్, ఎర్రవల్లి శ్రీనివాస్, నరేష్, కొండ సురేష్, రవి తదితరులతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పవన్ పుట్టినరోజు.. అభిమానుల సందడి!

- **గోదావరిఖనిలో ఘనంగా వేడుకలు.. కేక్ కట్ చేసిన కందుల సంధ్యారాణి**


**పెద్దపల్లి బ్యూరో, సెప్టెంబరు 02 (డీడీ9 వార్త):**

ప్రముఖ సినీ నటుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను గోదావరిఖనిలో ఘనంగా నిర్వహించారు. పవన్ కల్యాణ్ అభిమాని మీస వికాస్, శీతకారి గంగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి కేక్ కట్ చేసి పవన్ కల్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అభిమానులు, కార్యకర్తలు పరస్పరం కేక్ తినిపించుకుంటూ ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరుపుకున్నారు.

కందుల సంధ్యారాణి మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజా సేవలో ముందుకు సాగుతున్నారని అన్నారు. ఆయనకు ఆయురారోగ్యాలు, విజయాలు కలగాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సులువ లక్ష్మీనరసయ్య, బీజేపీ లేబర్ సెల్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ తడగొండ నరసయ్య, మహిళా మోర్చా పెద్దపల్లి జిల్లా అధ్యక్షురాలు చిలుక భారతి, ఎస్సీ మోర్చా పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మచ్చ విశ్వాస్, బీజేపీ పెద్దపల్లి జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు ఎల్తూరి సరిత, అంతర్గాం మండల అధ్యక్షుడు బోడకుంటి సుభాష్, పాలకుర్తి మండల అధ్యక్షుడు మెరుగు నరేష్‌గౌడ్, లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.



నాయకులు సులువ పద్మ, కోడూరు రమేష్, కొట్టే నరేష్, అందే రాజ్‌కుమార్‌చారి, శీతకారి గంగరాజు, జక్కుల ప్రవీణ్-పద్మ, ఎల్తూరి రాజయ్య, పాకాల నరసింహారెడ్డి, హనుమాన్ల వెంకటేష్, అంకరి భరత్, బూడిద హర్ష, మిస్ వికాస్, జక్కన బాలు, బుంగ మహేష్, జనగామ శివరాం, లింగాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి ఆగడాలపై ఏసీపీ కొరడా!

- 'ఆపరేషన్ చబుత్రా'తో గోదావరిఖనిలో హైఅలర్ట్.. 30 మంది యువకులు పోలీసుల అదుపులో
- ఏసీపీ మడత రమేష్ పర్యవేక్షణలో ముమ్మర నైట్ చెకింగ్.. గంజాయి అడ్డాలు, బెల్ట్ షాపులపై ప్రత్యేక నిఘా
- రెండు బెల్ట్ షాపులపై కేసులు.. రాత్రి 10 తర్వాత గుంపులుగా తిరిగితే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరిక

**పెద్దపల్లి బ్యూరో, సెప్టెంబరు 02 (డీడీ9 వార్త):**






అర్ధరాత్రి వేళల్లో రోడ్లపై అనవసరంగా తిరుగుతూ అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై రామగుండం పోలీసులు కొరడా ఝళిపించారు. గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ పర్యవేక్షణలో 'ఆపరేషన్ చబుత్రా'ను ముమ్మరం చేసి రాత్రి వేళల్లో ప్రధాన కూడళ్లు, వీధులు, రహదారులపై విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.
రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు చేపట్టిన ఈ ఆపరేషన్‌లో గోదావరిఖని 1 టౌన్, ఎన్టీపీసీ, రామగుండం పోలీస్ స్టేషన్ పరిధుల్లో పోలీసులు బైక్‌లపై విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహించారు. గుంపులుగా సంచరిస్తున్న యువకులు, మద్యం సేవించి ద్విచక్ర వాహనాలపై తిరుగుతున్న వారు, అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను ఆపి తనిఖీ చేశారు. అర్ధరాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై తిరుగుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న యువకులతో పాటు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా 30 మంది యువకులతో పాటు వారి ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి, ఈపెట్టీ కేసులు నమోదు చేశారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించి, భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**గంజాయి.. బెల్ట్ షాపులపై ఏసీపీ ఫోకస్**
గంజాయి వినియోగం, విక్రయాలకు అవకాశం ఉన్న ప్రాంతాలతో పాటు బెల్ట్ షాపులు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారే ప్రదేశాలపై ఏసీపీ ఎం. రమేష్ ప్రత్యేక దృష్టి సారించారు. అనుమానాస్పద ప్రాంతాలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెండు బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు.
ఏసీపీ మడత రమేష్ మాట్లాడుతూ... రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంతో పాటు ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొం దిం చేం దు కే 'ఆపరేషన్ చబుత్రా' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాత్రి 10 గంటల తర్వాత యువకులు రోడ్లపై అనవసరంగా గుంపులుగా తిరగడం, విన్యాసాలు చేయడం వంటి చర్యలకు పాల్పడితే అదుపులోకి తీసుకుని వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. యువత అప్రమత్తంగా ఉండాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

**యువతకు ఏసీపీ హితవు..**
యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మారకుండా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని ఏసీపీ సూచించారు. అర్ధరాత్రి వేళల్లో అనవసరంగా బయట తిరగడం వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళల్లో అనవసరంగా బయటకు వెళ్లకుండా చూడాలని కోరారు. 'ఆపరేషన్ చబుత్రా'లో పట్టుబడిన యువకుల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

**ప్రజలు సహకరించాలి..**
ప్రజల భద్రత, సౌకర్యం కోసం పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తోందని ఏసీపీ ఎం. రమేష్ తెలిపారు. ఎక్కడైనా గంజాయి, అక్రమ మద్యం విక్రయాలు లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా నిరంతర పెట్రోలింగ్, నైట్ చెకింగ్‌తో పటిష్టమైన పోలీసింగ్ కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఏసీపీ ఎం. రమేష్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో గోదావరిఖని 1 టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, అఫ్జలోద్దీన్, రామగుండం సీఐ కృష్ణకుమార్, ఎస్ఐలు మనోహర్, సంధ్య, అంతర్గం ఎస్ఐ వెంకటస్వామితో పాటు పోలీస్ స్టేషన్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

# వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా.. ఎమ్మెల్యే పాయం ఘన నివాళి..

- ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆ మహనీయుని స్మరించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

**మణుగూరు. సెప్టెంబర్ 2(డి డి 9వార్త)**



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, మణుగూరులో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పేదలు, రైతులు, విద్యార్థులు, మహిళలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకొచ్చాయని తెలిపారు.
వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించడం, ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావడం, రైతులకు ఉచిత విద్యుత్ అందించడం, జలయజ్ఞం ద్వారా సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వడం, ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేదలకు గృహ వసతి కల్పించడం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని గుర్తు చేశారు. అలాగే గ్రామీణ పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఇందిరమ్మ ఇళ్లు, పావలా వడ్డీ, మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వేగంగా వైద్య సేవలు అందించేందుకు 108 అత్యవసర సేవలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వైద్య రంగంలో కొత్త మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు.రైతుల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా చేసుకుని ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులు, రైతులకు మద్దతుగా పలు కార్యక్రమాలను అమలు చేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పేద కుటుంబాలకు వైద్యం, విద్య, గృహ వసతి వంటి మౌలిక అవసరాలను ప్రభుత్వ బాధ్యతగా భావించి సంక్షేమ పాలనకు వైఎస్సార్ ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని అన్నారు.వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజలతో మమేకమై వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేసిన ప్రజా నాయకుడని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయడమే వైఎస్సార్‌కు అందించే నిజమైన నివాళి అని అన్నారు.
ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు తదితరులు పాల్గొని దివంగత వైఎస్సార్‌కు ఘన నివాళులు అర్పించారు.

# అసెంబ్లీకి రాని కేసీఆర్‌కు ఎమ్మెల్యే పదవి ఎందుకు..? — వెంటనే రాజీనామా చేయాలి.!

- ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించని ప్రతిపక్ష నేతకు పదవి ఎందుకు.?
- రూ.22.24 కోట్ల ప్రజాధనం ఖర్చవుతున్నా.. ప్రజల కోసం అసెంబ్లీకి రారా?
- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్..
- కరకగూడెంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ – నిరసన కార్యక్రమం.

**మణుగూరు. సెప్టెంబర్ 2 (డి డి 9వార్త)**



బుధవారం నాడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి, TPCC-DCC అధ్యక్షుల పిలుపు మేరకు, పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు, కరకగూడెం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి పెట్రోల్ బంక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్-రాజీవ్ సెంటర్లో కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కరకగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడుతూ..
ప్రతిపక్ష నాయకుడిగా, ఎమ్మెల్యేగా ఎన్నికైన కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురాకపోవడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు.
కేసీఆర్‌కు జీతం, భద్రతా సిబ్బంది, బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు తదితర ఖర్చులకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించిన రూ.22.24 కోట్ల ప్రజాధనం అంశాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రజల సొమ్ముతో సౌకర్యాలు పొందుతున్నప్పుడు, అదే ప్రజల కోసం అసెంబ్లీకి వచ్చి వారి సమస్యలను ప్రస్తావించి పోరాడాల్సిన బాధ్యత కేసీఆర్‌పై ఉందన్నారు.
"తెలంగాణ ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజల కోసం అసెంబ్లీలో ఉండాలి. అసెంబ్లీకి రాకుండా ఎమ్మెల్యే పదవిని కొనసాగించడం ఎందుకు? ఏమాత్రం తెలంగాణ ప్రజలపై ప్రేమ, బాధ్యత ఉన్నా వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి" అని సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ డిమాండ్ చేశారు.

**"ప్రజల వద్దకే పాలన..**
**ఇదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం"**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు దూరంగా ఉండే పాలనకు స్వస్తి పలికి, ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తోందని,ప్రతి మండల కేంద్రంలో ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిదేనని అన్నారు.ప్రజలు తమ సమస్యల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా, ప్రజల వద్దకే ప్రభుత్వం వెళ్లి వారి సమస్యలను విని పరిష్కరించే విధంగా ప్రజాపాలనను కొనసాగిస్తున్నామని తెలిపారు.ఇక కేసీఆర్ పాలనలో ఇచ్చిన హామీలపై సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడుతూ..
దాదాపు 9.5 సంవత్సరాలు తెలంగాణను పరిపాలించిన కేసీఆర్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో అనేకం నెరవేర్చలేదని విమర్శించారు.
ఎన్నికల సమయంలో, ఉద్యమ సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ..
* దళితుడికి ముఖ్యమంత్రి పదవి
* దళితులకు 3 ఎకరాల భూమి
* రైతులకు ఏకకాలంలో రుణమాఫీ
* ఏడాదికి లక్ష ఉద్యోగాలు
* ఇంటికొక ఉద్యోగం
* నిరుద్యోగులకు భృతి
* బీసీ బంధు
* మద్యపానం నిషేధం
* పోడు భూములకు పట్టాలు
* 100 శాతం రాయితీపై వ్యవసాయ యంత్రాలు
* రైతులకు 100 శాతం ఉచితంగా ఎరువులు
* ప్రైవేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య
* ప్రతి మండలానికి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్
* పంటలకు మద్దతు ధరల స్థిరీకరణకు ప్రత్యేక బడ్జెట్
* ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్
* భద్రాచలం రామాలయం అభివృద్ధికి రూ.1,000 కోట్ల నిధులు
* వరి పంటకు మద్దతు ధర
(ఇస్తానని చెప్పి.. అసలు వరి వేస్తే ఉరే అన్నారు)
* ఉద్యమకారులకు గుర్తింపు, పదవులు
* ఉద్యమకారులకు గౌరవభృతి, పింఛన్లు
* కుటీర పరిశ్రమలకు ప్రోత్సాహకాలు
* గృహాలకు ఉచిత విద్యుత్

"ఇలా ఉంది మీ ఉత్తుత్తి హామీల చిట్టా. ఒక్కటంటే ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చని మీరు.. నేడు ప్రజా ప్రభుత్వాన్ని ప్రశ్నించే అర్హత ఎక్కడిది?" అని సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ గారు ప్రశ్నించారు.
తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, ప్రజలను మభ్యపెట్టి అధికారంలో కొనసాగారని, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి కూడా ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళం వినిపించకుండా ప్రజలకు దూరంగా ఉండటం సరైన విధానం కాదన్నారు. "ప్రజల కోసం పనిచేయాలనే చిత్తశుద్ధి లేకపోతే పదవిని పట్టుకుని ఉండటం ఎందుకు? తెలంగాణ ప్రజలపై ఏమాత్రం గౌరవం, ప్రేమ ఉంటే వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి" అని ఆయన మరోసారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ నాయకులు, మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.




# పేద ప్రజల వైద్యానికి అండగా.. సీఎం రిలీఫ్ ఫండ్.

- లక్షా ఆరు వేల రూపాయల CMRF చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే పాయం.

**మణుగూరు. సెప్టెంబర్ 2 (డి డి 9వార్త)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఆళ్లపల్లి మండలం,ముత్తాపురం గ్రామానికి చెందిన ఈసం జయసుధ కు 46 వేల రూపాయల విలువైన సిఎం రిలీఫ్ ఫండ్ (CMRF) చెక్కును, అలాగే జీలకర్ర నాగార్జునకు మంజూరైన 60 వేల రూపాయలు విలువైన సిఎం రిలీఫ్ ఫండ్ (CMRF) చెక్కును బుధవారం నాడు మణుగూరు లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,అనారోగ్యంతో బాధపడుతున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల విషయంలో ప్రభుత్వం అండగా నిలుస్తోందని అన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యం చేయించుకోలేని కుటుంబాలకు CMRF ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని,అవసరమైన సమయంలో అర్హులైన వారికి ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు.నియోజకవర్గ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తనవంతు కృషిని కొనసాగిస్తానని తెలిపారు.
CMRF చెక్కులను అందుకున్న లబ్ధిదారులు,ప్రభుత్వానికి,ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేసారు.



**ప్రజా పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా.. ఎమ్మెల్యే పాయం కు శుభాకాంక్షలు తెలిపిన.... ఉప సర్పంచ్ గాండ్ల సురేష్.**

**మణుగూరు. సెప్టెంబర్ 2 (డి డి 9వార్త)**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో నేటితో1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మణుగూరు లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం (ప్రజా భవన్) లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలుసుకొని ప్రజాపాలన 1000 రోజుల మైలురాయిని చేరుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గాండ్ల సురేష్ మాట్లాడుతూ, ప్రజాప్రభుత్వం పినపాక నియోజకవర్గంలో నిష్పక్షపాతంగా సంక్షేమ ఫలాలను అందివ్వడంతో పాటు నియోజకవర్గాన్ని విద్య, వైద్యం , వ్యవసాయం మరియు పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తూ , నియోజకవర్గంలో సామాజిక న్యాయాన్ని పాటిస్తూ అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తున్న పినపాక నియోజకవర్గ ప్రజా నాయకుడు.. బడుగు బలహీన వర్గాల పక్షపాతి.. సింగరేణి ముద్దుబిడ్డ, జననేత పాయం వెంకటేశ్వర్లు గారని పేర్కొన్నారు.
అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు & శుభాకాంక్షలను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సమితి సింగారం గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, పాల్వంచ రాములు, ఉప సర్పంచ్ గోరంట్ల కనకయ్య, పెద్దులు తదితరులు పాల్గొన్నారు.


# ఎలాంటి టెండర్ లేకుండానే క్యాంటీన్ నిర్వహణ.

- ఖని సిమ్స్ మెడికల్ కళాశాలలో నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్ర కాంట్రాక్టర్‌కు అప్పగింత.
- అసలు మెడికల్ కళాశాల ప్రభుత్వానిద లేక ముఖ్యధికారిదా.
- స్థానిక నిరుద్యోగులకు అవకాశం ఇవ్వాలని మద్దెల దినేష్ డిమాండ్.

**డిడి9వార్త / రామగుండం సెప్టెంబర్ 3:**

సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఖని సిమ్స్) మెడికల్ కళాశాలలో క్యాంటీన్ నిర్వహణను ఎలాంటి టెండర్ ప్రక్రియ లేకుండానే ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించడంపై అనేక అనుమానాలు, ఆరోపణలు వ్యక్తమవుతున్నాయని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ తెలిపారు.కళాశాల ప్రారంభమై సుమారు నాలుగు సంవత్సరాలు గడిచినా క్యాంటీన్ నిర్వహణ కోసం స్థానిక నిరుద్యోగులకు అవకాశం కల్పించలేదని, తాజాగా సుమారు పది రోజుల క్రితం కళాశాల నిర్మాణ పనులు చేపట్టిన ఓ కాంట్రాక్టర్‌కు క్యాంటీన్ నిర్వహణ బాధ్యతలు అప్పగించినట్లు ఆయన ఆరోపించారు.క్యాంటీన్ నిర్వహణ కోసం గతంలో ఎలాంటి బహిరంగ టెండర్లు పిలవకపోవడం, స్థానిక నిరుద్యోగులకు సమాచారం ఇవ్వకుండానే క్యాంటీన్ ప్రారంభించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఈ వ్యవహారంలో రూ.10 లక్షలు చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోందని, ఈ ఆరోపణలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.
స్థానిక నిరుద్యోగ యువత క్యాంటీన్ నిర్వహణ కోసం నాలుగు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నప్పటికీ వారికి అవకాశం ఇవ్వకుండా ఇతర ప్రాంతానికి చెందిన ఆంధ్ర కాంట్రాక్టర్‌కు బాధ్యతలు అప్పగించడం అన్యాయమని వారు అగ్రహం వ్యక్తం చేసారు.ప్రస్తుతం క్యాంటీన్‌లో విద్యార్థుల కోసం టీ, కాఫీ, స్నాక్స్ తదితర వస్తువులు విక్రయిస్తున్నారని, ప్రభుత్వ ఆధీనంలోని వైద్య కళాశాలలో క్యాంటీన్ నిర్వహణకు సంబంధించిన టెండర్, నిబంధనలు, ఆదాయ వనరులు, ఒప్పంద వివరాలను బహిరంగపరచాలని డిమాండ్ చేసారు.
ఎలాంటి టెండర్ లేకుండా క్యాంటీన్ నిర్వహణ అప్పగించడానికి కారణాలు ఏమిటి? ఐదు సంవత్సరాల నిర్వహణకు ఒప్పందం కుదిరిందా? కుదిరితే ఏ నిబంధనల ప్రకారం కుదిరింది? ప్రభుత్వానికి వచ్చే ఆదాయం ఎంత? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని మద్దెల దినేష్ డిమాండ్ చేశారు.నిబంధనలకు విరుద్ధంగా క్యాంటీన్ నిర్వహణ జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే వెంటనే ప్రస్తుత నిర్వహణను నిలిపివేసి, పారదర్శకమైన టెండర్ ప్రక్రియ నిర్వహించి స్థానిక నిరుద్యోగ యువతకు అవకాశం కల్పించాలని కోరారు.
అలాగే క్యాంటీన్ కేటాయింపుపై వచ్చిన రూ.10 లక్షల ఆరోపణలపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణకు ఆదేశించాలని, వైద్య విద్యా శాఖ మంత్రి &డి ఏం ఈ,అధికారులు కూడా స్పందించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అన్ని వ్యవహారాలు నిబంధనల ప్రకారం, పారదర్శకంగా జరగాలని, అధికారులు తమ ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకోకుండా ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని మద్దెల దినేష్ డిమాండ్ చేసారు.ఇట్టి విషయం పై డి ఏం ఈ,మరియు వైద్య శాఖ మంత్రి వర్యులు కి కూడా ఫిర్యాదు చేశామని వారు తెలిపారు.





## మండలం లోని పలు పంచాయతీలలో సమస్యల పరిష్కారం కోసం..

- **ఎమ్మెల్యే పాయంకు వినతిపత్రాలను అందజేసిన ప్రజా ప్రతినిధులు.**

**మణుగూరు. సెప్టెంబర్ 2 (డి డి 9వార్త)**

భద్రాద్రి జిల్లా, మణుగూరు మండలం లోని రామానుజవరం,సాంబాయిగూడెం గ్రామపంచాయతీ ల పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి,అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ.. బుధవారం నాడు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ను కలిసి వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ,గ్రామాలలో అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, ప్రజల రవాణా సౌకర్యం కోసం రిక్వెస్ట్ బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని, అలాగే అవసరమైన సిసి రోడ్లు,డ్రైనేజీ, వీధి దీపాలు,త్రాగు నీటి సౌకర్యం మెరుగుపరచాలని కోరారు. అలాగే గ్రామపంచాయతీ ల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కు వినతి పత్రాలను అందజేశారు. వినతి పత్రాలను స్వీకరించిన ఎమ్మెల్యే సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంబాయిగూడెం సర్పంచ్ చిడెం ఉషారాణి,రామానుజవరం గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ కొడారి రాణి,తమ్మిశెట్టి సాంబ, కట్ట నరసింహారావు, డేగల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



## పోటీ ప్రపంచంలో గెలుపునకు వారధి

- **భద్రాచలం ఐటీడీఏ పీఓ బి. రాహుల్**

**భద్రాచలం టౌన్ , సెప్టెంబరు 2 (డిడి9 వార్త)**

గిరిజన విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేసి వారి భవిష్యత్తుకు విజయ వారధిగా నిలిపేందుకు 'వారధి' పుస్తకాన్ని రూపొందించినట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. బుధవారం బీఈడీ కళాశాలలో ఇంగ్లీష్ , గణితం ఉపాధ్యాయులకు 'వారధి' పుస్తకంపై నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొన్నారు. పదో తరగతి అనంతరం పాలిటెక్నిక్ , గురుకులం, ఆర్మీ, పోలీస్ , ఆర్ ఆర్ బీ తదితర పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసేలా ఇంగ్లీష్ , రీజనింగ్ , లాజికల్ , అర్థమెటిక్ అంశాలతో పుస్తకాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఓఎంఆర్ షీట్ తరహా ప్రాక్టికల్ పరీక్షలను కూడా అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో వారానికి మూడు తరగతులు నిర్వహించి 'వారధి'లోని అంశాలను విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని హెచ్ ఎంలను ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం, ఆహారం, మెనూ, నిత్యావసర సరుకుల నిల్వలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాలల్లో అవసరమైన మైనర్ రిపేర్లను వెంటనే చేపట్టాలని తెలిపారు. అనంతరం వారధి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీడీ చందన, ఈఈ మధుకర్ , ఏసీఎంవోలు రమేష్ , రాములు, ఏటీడీవో చంద్రమోహన్ , డీఈ విజయ్ కుమార్ , జీసీడీవో అలివేలు మంగతాయారు, హెచ్ ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పేదల పక్షపాతి వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

- **వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు**

**భద్రాచలం టౌన్ , (డిడి9 వార్త)**

దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఘనంగా నివాళులర్పించారు. భద్రాచలం పాత మార్కెట్ లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పరిమి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు ఉచిత వైద్యం, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన మహానేత వైఎస్సార్ అని కొనియాడారు. రైతుల సమస్యలను తెలుసుకునేందుకు ఆయన చేపట్టిన చారిత్రక పాదయాత్రతో పాటు పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అమలు చేసిన పలు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చిరస్మరణీయమన్నారు. వైఎస్సార్ అందించిన సంక్షేమ పాలన ప్రజా ప్రభుత్వాలకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు సేవ చేయడమే తమ లక్ష్యమని తెలిపారు.

కార్యక్రమంలో పార్టీ నాయకులు భోగాల శ్రీనివాస్‌రెడ్డి, రత్నం రమాకాంత్, నర్రా రాము, భీమవరపు వెంకటరెడ్డి, చింతీరాల రవికుమార్, చింతాడి చిట్టిబాబు, అడబాల వెంకటేశ్వర్లు, ఎండీ జిందా, చాట్ల రవి, శీలం రామ్మోహన్‌రెడ్డి, రసమల్ల రాము, బసవరాజు, 15వ వార్డు సభ్యురాలు సున్నం ఈశ్వరి, 18వ వార్డు సభ్యురాలు జగ్గా కుమారి, సరిత, బత్తుల సాంబయ్య, గానుగ రమణ, ఆదినారాయణ, జగ్గా పుల్లయ్య, బంధం శ్రీనివాస్, మాధవరావు, ఎస్.ఎస్.రావు, బి.వి.ఆర్.ఆర్.సింగ్, నాయుడు, బషీర్, యూత్ నాయకులు గాడి విజయ్, మాచినేని భాను తదితరులు పాల్గొన్నారు.



# సెప్టెంబర్ 6 నీటి విడుదలకు డెడ్‌లైన్..

- **సెప్టెంబర్ 6 నీటి విడుదలకు డెడ్‌లైన్..**
- **ప్రజా ప్రతినిధుల పర్యాటక కేంద్రంగా మారిన మారేళ్లపాడు.**
- **గోదావరి జలాల తరలింపుపై ఇక ఉపేక్షించేది లేదు..**
- **రైట్ కెనాల్ పనులను కూడా వెంటనే ప్రారంభించాలి.**
- **జాప్యం జరిగితే సెప్టెంబర్ 7 నుంచి ఆమరణ నిరాహార దీక్ష..**
- **ప్రభుత్వానికి బీఆర్ఎస్ పార్టీ అల్టిమేటం.**

**మణుగూరు. సెప్టెంబర్ 2 (డి డి 9వార్త)**



మారెళ్ళ పాడు లెఫ్ట్ కెనాల్ ద్వారా గోదావరి జలాల తరలింపు విషయంలో ప్రభుత్వం ఇకనైనా స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని అశ్వాపురం మండల బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది.తుమ్మల చెరువుకు నీటి విడుదలకు సెప్టెంబర్ 6వ తేదీని డెడ్‌లైన్‌గా ప్రకటిస్తూ ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసింది. బుధవారం అశ్వాపురం మండలం బిఆర్ఎస్ పార్టీ నాయకులు మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ ఆధ్వర్యంలో సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో భాగమైన మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోదావరి జలాల తరలింపుపై ప్రభుత్వం చేస్తున్న జాప్యాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.

ఇంకెన్నాళ్ళు మాయమాటలు చెబుతూ సాగునీటి కోసం రైతులను నిరీక్షింపజేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికే మారెళ్ళ పాడు లెఫ్ట్ కెనాల్ ద్వారా తుమ్మలచెరువుకు నీళ్లు విడుదల చేస్తామని చెప్పి మూడు గడువులు దాటిపోయాయని,

ఇంకా నీటి విడుదలపై స్పష్టమైన హామీ అధికారులు గానీ, ప్రభుత్వం గానీ ఇవ్వట్లేదని వారు విమర్శించారు. తుమ్మలచెరువు ఆయకట్టు పరిధిలోని రైతులు ప్రభుత్వం నీటి విడుదలకు ఇచ్చిన గడువుతో చెరువులో ఉన్న కొద్దిపాటి నీటిని తూములు తెరిచి వ్యవసాయ పనులు ముమ్మరం చేశారని, ఈ క్రమంలో గడువు మీరినా ఇంకా పనులు పూర్తి కాకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 25 కోట్ల రూపాయల పనులు చేయడానికి ఈ ప్రభుత్వానికి మూడు సంవత్సరాలు పట్టిందని, ఇంకా మారెళ్ళపాడు రైట్ కెనాల్ పనులు ప్రతిపాదనలకు కూడా నోచుకోలేదని తక్షణమే రైట్ కెనాల్ పనులను కూడా మొదలుపెట్టి అశ్వాపురం మండలంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని వారు డిమాండ్ చేశారు. కరువు ప్రభావంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని,ప్రజా ప్రతినిధుల పర్యటనకు మారెళ్ళపాడు పర్యాటక కేంద్రంగా మారింది తప్ప రైతులకు ఇప్పటివరకు ఒరిగింది ఏమీ లేదని, "పర్యటనలు వద్దు మాకు పనులు కావాలన్నారు".

సెప్టెంబర్ 6లోగా తుమ్మలచెరువుకు గోదావరి జలాల విడుదలకు చర్యలు తీసుకోకపోతే సెప్టెంబర్ 7 నుంచి ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని బీఆర్ఎస్ పార్టీ నాయకులు హెచ్చరించారు.

రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే కార్యాచరణ ప్రకటించాలని లెఫ్ట్ కెనాల్ నుంచి నీటి విడుదల తో పాటు రైట్ కెనాల్ పనులు కూడా ప్రారంభించాలన్నారు. గోదావరి జలాల విషయంలో ఇక మాటలు కాకుండా చేతల్లో నిర్ణయం చూపించాలని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించింది. సెప్టెంబర్ 6లోగా సాగునీళ్లు ఇవ్వకపోతే సెప్టెంబర్ 7 నుండి రైతుల పక్షాన అమరణ నిరాహారదీక్ష

తోపాటు,రైతు ఉద్యమాలు నిర్మించి ఆందోళనలు నిర్వహిస్తామని, గోదావరి జిల్లాల తరలింపుపై ఇక ఉపేక్ష లేదని, ప్రభుత్వానికి సూటి హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల కార్యదర్శి మర్రి మల్లారెడ్డి,సీనియర్ నాయకులు సూది రెడ్డి గోపాలకృష్ణారెడ్డి,యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ,బీసీ సెల్ అధ్యక్షుడు భాగవతపు సతీష్,ఉప సర్పంచులు దేవన బోయిన మహేష్, గాడిద మహేష్,గుంపేన శ్రీను,కడారి వేణు,బొల్లిన నాగరాజు,మాణిక గణేష్, ఇసంపల్లి పున్నారావు, మంగళగిరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఫుడ్ పాయిజన్ బాధిత చిన్నారులకు ఎమ్మెల్యే పరామర్శ

- **మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆదేశం**

**భద్రాచలం , సెప్టెంబరు 2 (డిడి9 వార్త)**

ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురై భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు బుధవారం పరామర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎటపాక మండలం గొల్లగుప్ప గ్రామానికి చెందిన పలువురు చిన్నారులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆసుపత్రికి చేరుకుని వారి ఆరోగ్య పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. చిన్నారులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన అన్ని వైద్య సేవలను అందించడంతో పాటు చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.

అనంతరం చిన్నారుల కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే మాట్లాడి ధైర్యం చెప్పారు. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చిన్నారులకు మెరుగైన వైద్యం అందేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.



ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, పార్టీ నాయకులు భోగాల శ్రీనివాస్‌రెడ్డి, రత్నం రమాకాంత్, చింతీరాల రవికుమార్, నర్రా రాము, భీమవరపు వెంకటరెడ్డి, చింతాడి చిట్టిబాబు, పెద్దినేని శ్రీనివాస్, యండి జిందా, చాట్ల రవి, రసమల్ల రాము, బషీర్, యూత్ నాయకులు గాడి విజయ్, మాచినేని భాను తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ను పాతాళానికి తొక్కేందుకు ప్రజలు సిద్ధం

- **ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారో ప్రజలకు చెప్పాలి**
- **కోట్ల అవినీతి జరుగుతున్నా నోరు మెదపడం లేదు**
- **500 బైక్‌లతో భద్రాచలంలో బీఆర్ఎస్ భారీ నిరసన ర్యాలీ**
- **బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్**

**భద్రాచలం, సెప్టెంబరు 2 (డిడి9 వార్త)**





రాష్ట్రంలో తిరిగి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్ అన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

బుధవారం భద్రాచలంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మేడువాయి పెట్రోల్ బంకు నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం మండలాలకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు సుమారు 500కు పైగా బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. గులాబీ జెండాలతో భారీగా తరలివచ్చిన కార్యకర్తలు, యువత నినాదాలతో పట్టణంలో సందడి నెలకొంది.

అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన సభలో రావులపల్లి రాంప్రసాద్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అభిమానుల కష్టంతో గెలిచిన భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారో ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేపై, ఆయన అనుచరులపై వస్తున్న అవినీతి, అక్రమాల ఆరోపణలపై ఆయన ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కేంద్రంగా కోట్ల రూపాయల అవినీతి జరుగుతోందని ఆరోపణలు వస్తున్నప్పటికీ ఎమ్మెల్యే మౌనం వహించడంలో ఆంతర్యమేమిటో ప్రజలకు వివరించాలన్నారు. ప్రజలకు అన్ని విషయాలు తెలుసని, సరైన సమయంలో సమాధానం చెబుతారని అన్నారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని రాంప్రసాద్ ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2,500, పింఛన్లను రూ.4 వేలకు పెంచడం, రైతులకు ఎకరాకు రూ.15 వేల పెట్టుబడి సాయం, యువతకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం వంటి హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దొంగ హామీలు, మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని అన్నారు.

**ఎమ్మెల్యే అనుచరుల అక్రమాలకు అంతులేదు**

బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు మానే రామకృష్ణ మాట్లాడుతూ భద్రాచలంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అనుచరులు చేస్తున్న అవినీతి, అక్రమాలకు అంతులేకుండా పోతోందని ఆరోపించారు. ఎమ్మెల్యే పీఏ కల్యాణ్ ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు వచ్చినప్పటికీ ఎమ్మెల్యే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి పాలకులు తమ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. ప్రజలు త్వరలోనే కాంగ్రెస్ పాలనకు తగిన సమాధానం చెబుతారని అన్నారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కోటగిరి ప్రబోధ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, దనం, ఆకోజు సునీల్, కాపుల సూరిబాబు, చర్ల మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, దుమ్ముగూడెం మండల కన్వీనర్ కణితి రాముడు తదితరులు పాల్గొన్నారు.

## సీపీని కలిసిన జిల్లా పోలీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

**బోధన్, నిజామాబాద్(డీడీ9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోలీస్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు బుధవారం జిల్లా పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్యను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన అధ్యక్షుడు, ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ ఎర్రపాటి శ్రీను సీపీకి పూల మొక్కను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడితో పాటు కార్యవర్గ సభ్యులను సీపీ అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సీపీ సాయి చైతన్య మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నూతన అసోసియేషన్ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. సిబ్బంది ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చి సమన్వయంతో పరిష్కరించుకునేలా కృషి చేయాలన్నారు. పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా క్రమశిక్షణతో వ్యవహరిస్తూ, సిబ్బందికి, అధికారులకు మధ్య అసోసియేషన్ ప్రతినిధులు ఒక సమర్థమైన వారధిలా నిలవాలని




పిలుపునిచ్చారు. జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సిబ్బంది సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. సీపీ సూచనలపై స్పందించిన నూతన అధ్యక్షుడు ఎర్రపాటి శ్రీను, సిబ్బంది సంక్షేమం మరియు సమస్యల పరిష్కారం కోసం తన వంతు శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎం. వినోద్, జి. అనిల్ రెడ్డి, జనరల్ సెక్రటరీ ఎండి. యాసర్ అరాఫత్, జాయింట్ సెక్రటరీ బి. గోపాల్ సింగ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. మధు, ట్రెజరర్ డి. బాలకృష్ణ తో పాటు ఇతర ఎగ్జిక్యూటివ్, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. ఏఆర్ ఏసీపీ శ్రీరాములు, ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్ తదితర పోలీస్ అధికారులు ఈ భేటీలో భాగస్వాములయ్యారు.

## హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీషిన ఎర్రబెల్లి

**జనగామ సెప్టెంబర్ 2(డిడి 9వార్త )బ్యూరో**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పాలకుర్తి చౌరస్తా నుంచి గుడివాడ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. మహిళలకు రూ.2,500, రైతు భరోసా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, వృద్ధులకు రూ.4 వేల పెన్షన్ వంటి హామీల అమలు ఏమైందని ఆయన ప్రశ్నించారు. 100 రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి, వెయ్యి రోజులు దాటినా ప్రజలకు పూర్తి సమాధానం చెప్పలేకపోతున్నారని విమర్శించారు.



# ఏజెన్సీలో సీజనల్ వ్యాధుల కట్టడికి ముందస్తు చర్యలు

- ఏజెన్సీలో సీజనల్ వ్యాధుల కట్టడికి ముందస్తు చర్యలు
- ఇంటింటా అవగాహన.. దోమల నివారణకు ప్రత్యేక కార్యాచరణ
- 30 రోజుల్లో రెండో విడత ఐఆర్ఎస్ పూర్తి చేయాలి
- జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారం రాథోడ్

**భద్రాచలం టౌన్, సెప్టెంబరు 2 (డిడి9 వార్త):**

వర్షాకాలం నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు క్షేత్రస్థాయిలో పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు.

బుధవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి మలేరియా అధికారులు, ఎల్‌టీఎస్, ఎంటీఎస్, టెక్నికల్ అసిస్టెంట్లతో సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో దోమల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ప్రజలు అనారోగ్యానికి గురై శారీరకంగా, ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

ఏజెన్సీ ప్రాంతంలోని పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది, మలేరియా అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పరిశుభ్రత, దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి దోమల వృద్ధికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

**30 రోజుల్లో రెండో విడత స్ప్రేయింగ్**

సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న సమస్యాత్మక గ్రామాలను గుర్తించి తొలి విడతగా ఇంటీరియర్ రెసిడెన్షియల్ స్ప్రే (ఐఆర్ఎస్) చేపట్టాలని డీఎంహెచ్‌వో సూచించారు. మొదటి



విడత స్ప్రేయింగ్ పూర్తయిన 30 రోజుల వ్యవధిలో రెండో విడత స్ప్రేయింగ్‌ను కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల వారీగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, దాని ప్రకారం కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు.

**ప్రయోగశాల సేవలపై సమీక్ష**

అనంతరం ప్రయోగశాల సేవల పనితీరు, వివిధ కార్యక్రమాల పురోగతిని డీఎంహెచ్‌వో సమీక్షించారు. ప్రజలకు నాణ్యమైన ప్రయోగశాల సేవలు అందించడంతో పాటు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సాంకేతిక నిపుణులకు సూచించారు. ప్రామాణిక విధానాలను పాటిస్తూ శాఖాపరమైన మార్గదర్శకాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.

సమావేశంలో ఏడీఎంహెచ్‌వో సైదులు, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీధర్, మలేరియా సెక్టార్ అధికారి నగేష్, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్, ల్యాబ్ టెక్నికల్ సూపర్‌వైజర్, తదితరులు పాల్గొన్నారు.

## కొంగల దుర్వాసనతో కంచనపల్లి గ్రామస్తులకు అవస్థలు

**జనగామ సెప్టెంబర్ 2(డిడి-9వార్త)బ్యూరో**



కంచనపల్లిలో దుర్వాసన సమస్య.. పట్టించుకోని పాలకవర్గం రఘునాథపల్లి మండల పరిధిలోని కంచనపల్లి గ్రామంలో కొంగలు అధికంగా చేరడంతో వాటి వల్ల వెలువడుతున్న దుర్వాసనతో పరిసర ప్రాంతాల్లోని గృహవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్వాసన కారణంగా ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను సుమారు 20 రోజుల క్రితమే గ్రామ కార్యదర్శి సంపత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరినట్లు గ్రామస్తులు తెలిపారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. సమస్యపై గ్రామ పాలకవర్గం కూడా స్పందించడం లేదని పేర్కొన్నారు.

పరిసర గృహాల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కొంగల వల్ల ఏర్పడుతున్న దుర్వాసన సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. ఈ సందర్భంగా మైలరపు శంభులింగం, వార్డు సభ్యుడు ఓరుగంటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా లోనే శ్రావణ్‌కుమార్

**జనగామ సెప్టెంబర్ 2(డిడి 9వార్త)బ్యూరో**

యువజన నాయకుడికి కీలక బాధ్యతలు మండల కాంగ్రెస్ పార్టీలో యువజన నాయకుడు లోనే శ్రావణ్‌కుమార్‌కు కీలక బాధ్యతలు దక్కాయి. కన్నాయపల్లి గ్రామానికి చెందిన ఆయనను మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

బుధవారం రఘునాథపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో నూతన మండల కమిటీలను ప్రకటించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి శ్రావణ్‌కుమార్‌ను మండల ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు.



తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు లకావత్ ధనవంతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా ఉప అధ్యక్షుడు లింగాల చందర్‌రెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులకు శ్రావణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.





# ప్రజా గొంతుకై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బిఆర్ఎస్ పార్టీ ...

- రేవంత్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిన 420 హామీల చిత్రాలతో 420 అడుగుల భారీ ఫ్లెక్సీ తో భారీ నిరసన ర్యాలీ*
- ప్రజా గొంతుకై ప్రభుత్వాన్ని నిలదీసిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు....
- ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి ఇంచార్జ్ ఉప్పల.వెంకటరమణ...

**అశ్వరావుపేట:సెప్టెంబర్02(డిడి 9 వార్త)**





అశ్వారావుపేట నియోజక కేంద్రం అశ్వారావుపేట లోని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆరు గ్యారంటీల అమలు పై ప్రజలను మోసం చేయడం మొదలు పెట్టి వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజా గొంతుకై ప్రశ్నించడానికి సిద్ధమై *సమరశంఖం పూరించిన BRS పార్టీ

తెలంగాణ రాష్ట్రంలో మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబర్ 2 వ తారీకుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు పూర్తి చేసుకుంటుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వంద రోజులలో నెరవేరుస్తామన్న హామీలను 1000 రోజులు ఐన హామీలను నెరవేర్చడంలో అధికార పార్టీ పూర్తిగా విఫలమైన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ మరియు కేటీఆర్ ఆదేశాల మేరకు అశ్వారావుపేట నియోజక వర్గ ఇంచార్జీ మెచ్చ. నాగేశ్వర రావు సూచనల మేరకు అశ్వారావుపేట మండల కో ఆర్డినేటర్ జూపల్లి.రమణారావు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ తరపున 7 రోజులు నిరసన కార్యక్రమాలలో భాగంగా ఈ రోజు అశ్వారావుపేట లో భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రోజు నుండి 7 రోజుల నిరసన కార్యక్రమలతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి ప్రజా గొంతుకై,ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీల అమలే ప్రధాన ఎజెండాగా పారిశుధ్యం, విద్యా,వైద్యం సమస్యలపై వాస్తవాలను ప్రజలకు వివరించడమే లక్ష్యంగా బిఆర్ఎస్ పార్టీ సమర శంఖం పూరించిందనీ,దానిలో భాగంగానే ఈ రోజు కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డులను ప్రజలకు పంచి భారీ నిరసన ర్యాలీ నిర్వహించమని,తెలియజేశారు.ప్రజలకు ఇచ్చిన హామీలు ప్రజలకు చేరే వరకు ,రైతుల యూరియా కష్టాలు విద్యుత్ కష్టాలు తీరే వరకు మా పోరాటం ఆగదని తెలియజేశారు. అలాగే మహిళలకు కళ్యాణ లక్ష్మి తో పాటు తులం బంగారం ఇస్తా అన్న మీరు కనీసం 8 గ్రాముల బంగారం ఐన ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఆడపడుచులకు 2500 విద్యార్థులకు స్కూటీలు,వికలాంగులకు, వృద్ధులకు పెంచుతా అన్న పెన్షన్లు,వెంటనే పెంచాలనీ డిమాండ్ చేశారు. అలాగే ప్రజా గొంతుకై ప్రజల పక్షాన నిలబడి నిరసన కార్యక్రమలు చేస్తూ మీ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై.. రోజుకో విధంగా వినూత్న కార్యక్రమాలు..... నిర్వహిస్తూ మీ ప్రభుత్వాన్ని ఎండగడతామని తెలియజేశారు.ఈ

కార్యక్రమంలో అన్ని మండలాల మాజీ ఎంపీపీ లు,జడ్పీటీసీ లు అన్ని మండలాల మాజీ పార్టీ అధ్యక్షులు,మాజీ సర్పంచ్ లు, వార్డు మెంబర్లు,మాజీ ప్రజా ప్రతినిధులు,మండల నాయకులు,అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే రేపటి నుండి జరిగే కార్యక్రమాలు కూడా విజయవంతం చేయాలని బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు నాయకులకు,అభిమానులకు మరియు ప్రజాప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులను కోరారు.

## విద్యార్థులకు నూతన యూనిఫాంల పంపిణీ చేసిన ఎంఈవో బెక్కంటి. శ్రీనివాసరావు

**భద్రాచలం , సెప్టెంబరు 2 (డిడి9 వార్త)**



భద్రాచలం మండల పరిధిలోని లంబాడి కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నూతన యూనిఫాంలను మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) బెక్కంటి శ్రీనివాసరావు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యూనిఫాంలను అందజేసి, వాటిని ధరించిన విద్యార్థులతో కలిసి ఎంఈవో, ఉపాధ్యాయులు ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా ఎంఈవో బెక్కంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేఎన్‌వీఆర్ జగన్‌మోహన్‌రావు, ఉపాధ్యాయురాలు ఎస్. అరుణ, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ గోపీకృష్ణ, టైలర్ దాసు తదితరులు పాల్గొన్నారు.

## రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

- ఫెడరేషన్ చైర్మన్ దాసరిరాజుకు టీఆర్ఆర్ఎస్ నాయకుల వినతి
- నూతన కనెక్షన్ల కోసం త్వరలో ఆన్‌లైన్ వెబ్‌సైట్
- బిల్లుల బకాయిలపై ఆందోళన వద్దు
- రజక సంక్షేమానికి కృషి చేస్తా: చైర్మన్

**జనగామ సెప్టెంబరు 2(డిడి 9వార్త)బ్యూరో**

రజక వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీఆర్ఆర్ఎస్ నాయకులు రజక ఫెడరేషన్ చైర్మన్ దాసరిరాజు అజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 250 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక తదితరులు పాల్గొన్నారు. రజకులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చైర్మన్ తెలిపారు. విద్యుత్



అధికారులు ఇబ్బంది పెడితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. బిల్లులను ప్రభుత్వమే చెల్లిస్తుందని స్పష్టం చేశారు. గతంలో కనెక్షన్లు తీసుకోని వారికి త్వరలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి కనెక్షన్లు ఇస్తామని చెప్పారు.




## రాహుల్ గాంధీపై అక్రమ కేసుల నమోదుకు నిరసనగా....

- భద్రాద్రి యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీకటి కార్తీక్, మరియు రాష్ట్ర కార్యదర్శి కలసాని సంజయ్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ

**మణుగూరు. సెప్టెంబర్ 2 (డి డి 9వార్త)**

కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న బహిరంగ సభ వేదికను కొందరు బీజేపీ మతోన్మాదులు గంగాజలంతో "శుద్ధీకరణ" చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ చర్యను దళితులను అవమానించడమేనని ఖండించారు. ఈ వివక్షపూరిత చర్యకు పాల్పడిన మతోన్మాదులపై వెంటనే కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేయగా, అందుకు భిన్నంగా అనైతికంగా రాహుల్ గాంధీ పైనే రివర్స్ కేసు నమోదు చేయడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

ఈ అక్రమ కేసులను నిరసిస్తూ పినపాక నియోజకవర్గంలోని మణుగూరు హెడ్‌క్వార్టర్స్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చీకటి కార్తీక్, మరియు రాష్ట్ర కార్యదర్శి కాలసాని సంజయ్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రోజు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.

ర్యాలీ అనంతరం స్థానిక డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వానికి, బీజేపీ వైఖరికి వ్యతిరేకంగా భారీ ఎత్తున నినాదాలు చేశారు.

దేశ నేత రాహుల్ గాంధీ పై పెట్టిన అక్రమ కేసులను కేంద్ర ప్రభుత్వం వెంటనే బేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధంగా ప్రశ్నిస్తున్న నాయకులపై కేసులు పెట్టడం బీజేపీ దిగజారుడు రాజకీయాకారానికి నిదర్శనమని మండిపడ్డారు. దళితుల పట్ల, బిసి, బహుజనుల పట్ల బీజేపీ అనుసరిస్తున్న మొండి వైఖరిని మార్చుకోకపోతే, రానున్న రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

ఈ నిరసన కార్యక్రమంలో పినపాక యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్ రెడ్డి, కొత్తగూడెం యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ పాల సత్యనారాయణ రెడ్డి, భద్రాచలం యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఎడారి ప్రదీప్, వైస్ ప్రెసిడెంట్ గాడి విజయ్, రామ్మూర్తి, ప్రణయ్, మణుగూరు మండల అధ్యక్షుడు ఐతనబోయిన సతీష్‌తో పాటు జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ఇతర నాయకులు మరియు కార్యవర్గ సభ్యులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శిరీష మృతిపై సమగ్ర విచారణ జరపాలి

- నిందితులను కఠినంగా శిక్షించాలి.. భద్రాచలం బార్ అసోసియేషన్ డిమాండ్

**భద్రాచలం టౌన్, సెప్టెంబరు 2 (డిడి9 వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చోటిగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ యువతి, నర్సు ఊకే శిరీష అనుమానాస్పద మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను వెలికితీయాలని భద్రాచలం బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం భద్రాచలం కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు నిరసన చేపట్టారు.శిరీష మృతికి దారితీసిన పరిస్థితులపై పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి, ఘటనకు బాధ్యులైన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని న్యాయవాదులు కోరారు. మృతురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం, పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచి, శిరీష మృతి వెనుక ఉన్న వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని కోరారు.

ఈ నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాసన్, ఉపాధ్యక్షుడు సున్నం రమేష్‌తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.




## నూతన ప్రెస్ క్లబ్ కు అభినందనలు తెలిపిన తుళ్లూరి బ్రహ్మయ్య..

- వార్త కథనాలు పారదర్శకంగా రాయాలి..

**మణుగూరు. సెప్టెంబర్ 2 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,అశ్వాపురం మండలం లో నూతనంగా ఏర్పాటైన నవ చైతన్య ప్రెస్ క్లబ్ ఏర్పాటు అనంతరం బుధవారం మండల కేంద్రంలోని తుళ్లూరి బ్రహ్మయ్య గారి క్యాంపు కార్యాలయంలో ఆయనను నూతన ప్రెస్ క్లబ్ కమిటీ మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. తొలుత ప్రెస్ క్లబ్ కు ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులను అభినందించిన ఆయన మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన ప్రెస్ క్లబ్ లోని విలేకరులంతా సమాజ హితం కోసం పారదర్శకంగా వ్యవహరిస్తూ వార్తలు ప్రచురించాలని ఆయన తెలిపారు. ప్రస్తుత సమాజంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమైందని ప్రభుత్వానికి ప్రజలకు మధ్య ఉంటున్న ఫోర్త్ ఎస్టేట్ ప్రాముఖ్యత ఎంతో ప్రాధాన్యమైందని ఆయన అన్నారు. ప్రెస్ క్లబ్ కు తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. బ్రహ్మయ్య ను కలిసిన వారిలో నవచైతన్య ప్రెస్ క్లబ్ కమిటీ గౌరవ అధ్యక్షుడు కుందూరు శ్రీనివాస్ రెడ్డి, గౌరవ సలహాదారు తునికేసి సురేందర్ రెడ్డి, కోశాధికారి ఎస్కే ఖదీర్, ఉపాధ్యక్షులు కత్తెరం వెంకటరమణారెడ్డి, పగడాల వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శి గరికపాటి అంజన్ రావు, మండల విజయ్ కుమార్, కానూరి రాంబాబు, అలవాల నాగరాజులు ఉన్నారు.







## వైఎస్సార్ జీవితం... ప్రజా సంక్షేమానికే అంకితం

- **చర్లలో ఘనంగా దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి వేడుకలు**

**చర్ల, సెప్టెంబర్ 2 (డిడి 9 వార్త )**

చర్ల మండల కేంద్రంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతిని చర్ల మండల కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి టీపీసీసీ జనరల్ సెక్రెటరీ నల్లపు దుర్గాప్రసాద్, డీసీసీ జిల్లా ఉపాధ్యక్షులు చీమలమర్రి మురళీ కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఆయన చేపట్టిన పలు కార్యక్రమాలు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశాయని పేర్కొన్నారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆవుల శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ కుంజా చంటి, ఎస్సీ సెల్ చర్ల మండల అధ్యక్షుడు మచ్చ రాజా, పొగాకు సత్తిబాబు, పూజారి రమణయ్య, మునిగెల వెంకన్న, గూడపాటి రంజిత్, చెన్నం పవన్,పాలెం నవీన్ కుమార్, కాయం శ్రీను, కేదారి వంశీ, పరవా శంకర్,సున్నం గంగరాజు, గద్దం నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం

**చర్ల, సెప్టెంబర్ 2 (డిడి 9 వార్త )**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ చర్ల మండల కన్వీనర్ దొడ్డి తాతారావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనకు నిరసనగా బుధవారం చర్ల నుంచి భద్రాచలం వరకు ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గులాబీ జెండాలు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తాతారావు మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు గడిచినా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. రైతు భరోసా, కల్యాణలక్ష్మి, తులం బంగారం, ఆసరా పింఛన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, యువతకు ఉద్యోగాలు తదితర హామీలను ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు వివరిస్తూ ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

- **సెప్టెంబర్ 4న ఉట్ల పండుగ మహోత్సవం**

**భద్రాచలం, సెప్టెంబర్ 2 (డిడి9 వార్త)**

పుణ్యక్షేత్రమైన భద్రాచలం పట్టణంలోని శ్రీకృష్ణ దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గోకులాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు.

వేడుకల్లో భాగంగా సెప్టెంబర్ 4న శుక్రవారం ఆలయ ప్రాంగణంలో సంప్రదాయబద్ధంగా ఉట్ల పండుగ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. బాలకృష్ణుడి లీలలను స్మరిస్తూ నిర్వహించే ఈ ఉట్ల మహోత్సవం శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానుంది. యువత ఉత్సాహంగా పాల్గొనే ఉట్టి కొట్టే పోటీలు, స్వామివారి ప్రత్యేక అలంకరణలు, భజన కీర్తనలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనున్నాయి.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణ ప్రజలు, పరిసర ప్రాంతాల భక్తులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉట్ల పండుగ మహోత్సవంలో పాల్గొని శ్రీకృష్ణుడిని దర్శించుకోవాలని ఆలయ కమిటీ కోరింది. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని సూచించింది. ఈ వేడుకకు భక్తులందరూ ఆహ్వానితులేనని కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది.


## గుండాల–హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ బస్సు సౌకర్యం కల్పించాలి

- **ఇల్లందు ఆర్టీసీ డీఎంకు నవ చైతన్య యువజన సంఘం వినతి**

**గుండాల, సెప్టెంబర్ 2 డిడి 9 వార్త:**

గుండాల మీదుగా హైదరాబాద్‌కు నేరుగా ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని నవ చైతన్య యువజన సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఇల్లందు ఆర్టీసీ డీఎం సుభాషినికి వినతి పత్రం అందజేశారు. ఇల్లందు నుంచి హైదరాబాద్‌కు నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఒక బస్సును గుండాల-పసర మీదుగా హైదరాబాద్‌కు నడపాలని కోరారు. గుండాల, పరిసర ప్రాంతాల నుంచి విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు, పేషెంట్లు ప్రతిరోజూ హైదరాబాద్‌కు వివిధ పనుల నిమిత్తం వెళ్తున్నారని తెలిపారు. నేరుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. గుండాల మీదుగా హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తే పేద, మధ్యతరగతి ప్రజలపై ప్రయాణ భారం తగ్గడంతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు, రోగులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే బస్సు సర్వీసును ప్రారంభించాలని కోరారు.

కార్యక్రమంలో ఎం. అశోక్, ఎస్కే. ఆజాద్, ఎం. వినయ్, కే. సతీష్, ఎం. రంజిత్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.







# విద్యాయాత్ర నేనుసైతం చేయూత – మన ఎమ్మెల్యే – మన బడి

- **మండలంలో ఆశ్రమ పాఠశాలలో ఆకస్మికంగా సందర్శించిన జారే ఆదినారాయణ...**

**అశ్వారావుపేట:సెప్టెంబర్ 02(డిడి 9 వార్త)**

విద్యార్థులకు మంచి చదువుతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు ఇందులో భాగంగా విద్యాయాత్ర నేనుసైతం చేయూత మనఎమ్మెల్యే మనబడి కార్యక్రమాన్ని చేపట్టి నియోజకవర్గంలోని పాఠశాలలు ఆశ్రమ పాఠశాలలు హాస్టళ్లను స్వయంగా పరిశీలిస్తున్నారు

ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి అశ్వారావుపేటలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు హాస్టల్‌లోని విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు

విద్యార్థులకు భోజనం ఎలా అందుతోంది తాగునీటి సౌకర్యం ఉందా మరుగుదొడ్లు విద్యుత్ వసతి గదులు పరిసరాల పరిశుభ్రత ఎలా ఉంది వంటి విషయాలను స్వయంగా పరిశీలించారు అనంతరం ఉపాధ్యాయులు హాస్టల్ సిబ్బందితో మాట్లాడి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు హాస్టల్‌లో ఏమైనా లోటుపాట్లు ఉంటే వెంటనే గుర్తించి పరిష్కరించాలని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలంటే మంచి విద్యతో పాటు మంచి వాతావరణం అవసరమైన సౌకర్యాలు ఉండాలని అన్నారు అందుకే తన పదవీకాలంలో ప్రభుత్వ పాఠశాలలు ఆశ్రమ పాఠశాలలు హాస్టళ్లు కళాశాలల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు పాఠశాలలు హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు తాను స్వయంగా పర్యటిస్తున్నానని గుర్తించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు





# స్టేషన్‌ఘన్‌పూర్ కాంగ్రెస్‌కు కంచుకోటగా తీర్చిదిద్దాలి

- **కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలి: ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**రఘునాథపల్లి, సెప్టెంబర్ 2:**

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా తీర్చిదిద్దేందుకు నాయకులు, కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. రఘునాథపల్లిలో నిర్వహించిన మండల, గ్రామ నూతన కమిటీల పరిచయ కార్యక్రమంలో వారు మాట్లాడారు.కొత్త, పాత అనే తేడా లేకుండా అందరినీ కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ప్రజల మధ్య ఉంటూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికే ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. రాబోయే ప్రతి ఎన్నికల్లోనూ స్టేషన్‌ఘన్‌పూర్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయ్యేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్, బీజేపీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు.ఈ సందర్భంగా దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిసిసి ప్రెసిడెంట్ ధన్వంతి జనగామ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాంబాబు. జనగామ జిల్లా కాంగ్రెస్ ఉప అధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్ రెడ్డి రఘునాథపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాదే మహేందర్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు, నూతన కమిటీ సభ్యులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పోలీసుల వేట.. ఏడాదిన్నర ఇంటి చోరీకేసు చేధన..

- **నిందితుడి అరెస్ట్**
- **రూ.1.52 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం..**

**సెప్టెంబర్ 02 డిడి9 వార్త వెంకటాపురం.**

వెంకటాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏడాదిన్నర క్రితం జరిగిన ఇంటి దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. నమ్మదగిన సమాచారం మేరకు బుధవారం ఉదయం వెంకటాపురం బస్టాండ్ వద్ద నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పోలీసుల వివరాల ప్రకారం.. 2025 ఏప్రిల్ 13న ఇండియన్ ఆయిల్ బంక్ సమీపంలోని సంకా వేమసుందర్ ఇంటి తాళం పగలగొట్టి బంగారు, వెండి ఆభరణాలతో పాటు రూ.10 వేల నగదును దొంగిలించినట్లు నిందితుడు పుప్పాల సాయి ప్రకాష్ (41) విచారణలో అంగీకరించాడు. గతంలో ఎటూరునాగారం పరిధిలో ట్రాక్టర్ దొంగతనం కేసులో జైలుకు వెళ్లిన సమయంలో పరిచయమైన వ్యక్తుల సహాయంతో దొంగిలించిన సొత్తును విక్రయించేందుకు వెంకటాపురం వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

నిందితుడి వద్ద నుంచి 15.500 గ్రాముల బంగారు ఆభరణాలు, 860.500 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.1,52,380గా పోలీసులు తెలిపారు.

కేసును ఛేదించడంలో ప్రతిభ కనబర్చిన వెంకటాపురం ఎస్ఐ కె. తిరుపతిరావు, కానిస్టేబుళ్లు వి. ప్రసాద్, ఎల్. బాల, ఎస్. రామకృష్ణలను అధికారులు అభినందించారు. నిందితుడిని కోర్టు ఎదుట హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.ఇళ్లను లాక్ చేసి బయటకు వెళ్లే సమయంలో విలువైన బంగారం, వెండి, నగదును ఇంట్లో ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు ప్రజలకు సూచించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.




## బాధితులు బయటకు రండి.. బీజేపీ అండగా ఉంటుంది

- **ఉద్యోగాల కుంభకోణంపై బాధితులతో కలిసి డీజీపీని కలుస్తాం**
- **బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుంజా ధర్మా**

**భద్రాచలం, సెప్టెంబర్ 2 (డిడి9 వార్త )**

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై బాధితులు ధైర్యంగా బయటకు రావాలని, వారికి బీజేపీ అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుంజా ధర్మా అన్నారు. దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తెల్లం హరికృష్ణ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.15 లక్షలు తీసుకున్నారన్న ఆరోపణలు, ఈ వ్యవహారంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పీఏ కళ్యాణ్‌కు సంబంధం ఉందన్న ఆరోపణలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు.

భద్రాచలం నియోజకవర్గానికి చెందిన మరికొందరు కాంగ్రెస్ నాయకుల ప్రమేయంపై కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయని, మొత్తం వ్యవహారం రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు ఉండొచ్చన్న సమాచారం ఉందని కుంజా ధర్మా పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగాల పేరుతో డబ్బులు చెల్లించి మోసపోయిన బాధితులు ఆధారాలతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బాధితులతో కలిసి తెలంగాణ డీజీపీని స్వయంగా కలిసి ఫిర్యాదు చేసి, సమగ్ర విచారణకు డిమాండ్ చేస్తామని తెలిపారు. అవసరమైతే కేంద్ర మంత్రులు జి. కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. బాధితుల్లో ఆదివాసీలు ఉంటే ఈ అంశాన్ని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా న్యాయం కోసం కృషి చేస్తామని కుంజా ధర్మా హామీ ఇచ్చారు. బాధితులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, తమకు జరిగిన అన్యాయానికి సంబంధించిన ఆధారాలతో ముందుకు వస్తే బీజేపీ అండగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కుంజా సంతోష్, నిడదవోలు నాగబాబు, పీసీ కేశవ్, గుమ్మల్ల వెంకటేశ్వర్లు (జీవా), బోడ సత్యనారాయణ, జంపాల ప్రభాకర్, గంగులకుర్తి రామాచారి తదితరులు పాల్గొన్నారు.




## హామీలు ఎక్కడ.. పాలన ఎక్కడ ..?

- **కాంగ్రెస్ పార్టీపై బి.ఆర్.ఎస్ ధ్వజం..**
- **ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం – గంప రాంబాబు..**

**సెప్టెంబర్ 02 డిడి9 వార్త వెంకటాపురం.**

కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని రంగాల్లో విఫలమైందని వెంకటాపురం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గంప రాంబాబు విమర్శించారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనల మేరకు, ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి, జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు ఆధ్వర్యంలో ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ సమరభేరి, మహాధర్నా కార్యక్రమంలో గంప రాంబాబు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజల కోసం.. ప్రజల గొంతుకగా.. ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. వెంకటాపురం మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి మహాధర్నాను విజయవంతం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మంచర్ల నాగేశ్వరరావు, బట్ట నాగేందర్, కొక్కురి సాయికిరణ్‌తో పాటు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



DD9 వార్త తెలుగు దినపత్రిక

# పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో జనసేన సేవా స్ఫూర్తి..





- **వెంకటాపురంలో ఘనంగా వేడుకలు.. జెండా ఆవిష్కరణ, భారీ బైక్ ర్యాలీ.. రోగులకు పండ్లు, పాలు పంపిణీ..**

**సెప్టెంబర్02 డిడి9 వార్త వెంకటాపురం.**

జనసేన పార్టీ అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు వెంకటాపురం మండల కేంద్రంలో జనసేన శ్రేణులు, అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల నాయకుడు డాక్టర్ జయసింహ ఆధ్వర్యంలో జనసేన జెండాను ఆవిష్కరించి వేడుకలకు శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు, యువత జనసేన కండువాలు కప్పుకొని పార్టీలో చేరారు. అనంతరం భారీ బైక్ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ వైద్యశాలకు చేరుకున్న జనసేన నాయకులు, కార్యకర్తలు చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి పండ్లు, పాలు పంపిణీ చేశారు.

పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో మొక్కలు నాటి "సేవే లక్ష్యం.. ప్రజలే బలం" అనే సందేశాన్ని చాటారు. ప్రజా సేవ, పర్యావరణ పరిరక్షణకు జనసేన శ్రేణులు నిరంతరం కృషి చేస్తాయని నాయకులు తెలిపారు.

అనంతరం జనసేన టిఫిన్ సెంటర్‌లో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి యువత, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా జనసేన శ్రేణులు ప్రజా సేవ పట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు.





# వ్యవసాయ రంగానికి సవాళ్లే సవాళ్లు

- **రైతు బలపడితేనే దేశం బలపడుతుంది**
- **సాగునీటి కొరతతో రైతుల అవస్థలు.. వర్షా ధార వ్యవసాయమే ఇంకా ఆధారం**
- **ఆధునిక పరికరాలు చిన్న రైతులకు అందేనా?**
- **భారతీయ కిసాన్ సంఘటన్ జాతీయ ప్రధాన కార్యదర్శి యర్రం వెంకటరెడ్డి**

**హైదరాబాద్,సెప్టెంబర్ 2,(డిడి9 వార్త):**

భారతదేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం అత్యంత కీలకమైనదని, రైతు బలపడితేనే దేశం బలపడుతుందని భారతీయ కిసాన్ సంఘటన్ జాతీయ ప్రధాన కార్యదర్శి యర్రం వెంకటరెడ్డి అన్నారు. దేశానికి వ్యవసాయ రంగం వెన్నెముకగా ఉన్నప్పటికీ రైతులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆయన పేర్కొన్నారు. సాగునీటి కొరత, వర్షాధార వ్యవసాయం, ఆధునిక వ్యవసాయ పరికరాల కొరత, పంటల మార్కెటింగ్, నిల్వ సౌకర్యాలు, రవాణా, రుణభారం వంటి సమస్యలను సమగ్రంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.

దేశంలో వ్యవసాయానికి అనుకూలమైన విస్తారమైన భూములు, భిన్నమైన వాతావరణ పరిస్థితులు, సమృద్ధిగా సహజ వనరులు ఉన్నప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నామని తెలిపారు. వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న కోట్లాది కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడాలంటే రైతులకు ఉత్పత్తి దశ నుంచి మార్కెటింగ్ వరకు ప్రభుత్వ సహకారం అందాలని సూచించారు.

**సాగునీటి కొరతతో రైతుల అవస్థలు**

వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో సాగునీటి కొరత ఒకటని యర్రం వెంకటరెడ్డి అన్నారు. అనేక ప్రాంతాల్లో రైతులు ఇప్పటికీ వర్షాలపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. వర్షాలు సకాలంలో కురవకపోతే పంటలు ఎండిపోవడం, అధిక వర్షాలు కురిస్తే పంటలు దెబ్బతినడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు.

అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడంతో పాటు చెరువులు, కుంటలు, కాలువలను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. నీటి సంరక్షణ, డ్రిప్, స్ప్రింక్లర్ వంటి ఆధునిక సాగునీటి విధానాలను చిన్న రైతులకు కూడా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

**వర్షా ధార వ్యవసాయమే ఇంకా ఆధారం**

దేశంలోని అనేక ప్రాంతాల్లో రైతులు వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నారని ఆయన తెలిపారు. వాతావరణ మార్పుల ప్రభావంతో వర్షాల తీరు కూడా మారుతున్న నేపథ్యంలో వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు.

వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భ జలాలను సంరక్షించడం, ప్రతి గ్రామంలో నీటి నిర్వహణపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చని పేర్కొన్నారు. నీటి వనరుల వినియోగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం అవసరమన్నారు.

**ఆధునిక పరికరాలు చిన్న రైతులకు అందేనా?**

ఆధునిక వ్యవసాయ పరికరాలు రైతుల ఉత్పాదకతను పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని యర్రం వెంకటరెడ్డి అన్నారు. అయితే చిన్న, సన్నకారు రైతులకు ఖరీదైన వ్యవసాయ యంత్రాలను కొనుగోలు చేయడం సాధ్యం కాకపోవడంతో వారు ఇప్పటికీ సంప్రదాయ పద్ధతులపైనే ఆధారపడుతున్నారని తెలిపారు.

చిన్న రైతుల కోసం గ్రామీణ ప్రాంతాల్లో కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి, ట్రాక్టర్లు, పంట కోత యంత్రాలు, ఇతర వ్యవసాయ పరికరాలను అద్దెకు అందించాలని సూచించారు. రైతు సంఘాలు, సహకార సంఘాల ద్వారా యంత్రాలను అందుబాటులోకి తీసుకురావడం వల్ల చిన్న రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు.

**ఒకే పంటపై ఆధారపడటం తగ్గించాలి**

రైతులు ఒకే రకమైన పంటలపై ఆధారపడకుండా పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలు, ఉద్యాన పంటలతో పాటు పశుపోషణ వంటి అనుబంధ రంగాలను కూడా వ్యవసాయంతో అనుసంధానం చేయాలని తెలిపారు.

పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పించడం ద్వారా నేల సారాన్ని కాపాడటంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచే అవకాశం ఉంటుందని అన్నారు.

**నిల్వ, మార్కెటింగ్ సమస్యలు పరిష్కరించాలి**

పంట చేతికి వచ్చిన వెంటనే తక్కువ ధరకు విక్రయించాల్సిన పరిస్థితి రైతులకు పెద్ద సమస్యగా మారిందని యర్రం వెంకటరెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తగినంత గోదాములు, కోల్డ్ స్టోరేజ్‌లు లేకపోవడంతో రైతులు మార్కెట్ ధరలు అనుకూలంగా లేకపోయినా పంటను అమ్ముకోవాల్సి వస్తోందన్నారు.

గ్రామస్థాయిలోనే శాస్త్రీయ నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు తమ ఉత్పత్తిని భద్రపరుచుకునే అవకాశం కల్పించాలని కోరారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, సహకార మార్కెటింగ్ వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించారు.

**రుణభారం తగ్గించాలి**

వ్యవసాయ పెట్టుబడులు పెరుగుతున్న నేపథ్యంలో రైతులకు సులభంగా, తక్కువ వడ్డీతో సంస్థాగత రుణాలు అందించాలని యర్రం వెంకటరెడ్డి అన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు పొందే ప్రక్రియను మరింత సరళీకరించాలని, చిన్న రైతులకు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు.

అనధికారికంగా అధిక వడ్డీ వసూలు చేసే వడ్డీ వ్యాపారుల వ్యవస్థపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**పంట బీమా.. వేగంగా పరిహారం అందాలి**

ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు పంట బీమా రక్షణ కల్పించాలని ఆయన అన్నారు. అయితే బీమా క్లెయిమ్‌ల పరిష్కారం వేగంగా, పారదర్శకంగా జరగాలని కోరారు.

వర్షాభావం, వరదలు, వడగళ్ల వానలు, తుఫాన్లు, తెగుళ్ల కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం త్వరితగతిన అందేలా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చాలని సూచించారు.



**రైతు విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి**

ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంట మార్పిడి, నేల పరీక్షలు, విత్తనాల ఎంపిక, ఎరువుల వినియోగం, మార్కెట్ ధరలు, ప్రభుత్వ పథకాలు వంటి అంశాలపై రైతులకు నిరంతర అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని యర్రం వెంకటరెడ్డి అన్నారు.

యువతను వ్యవసాయం వైపు ఆకర్షించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని సూచించారు. స్మార్ట్‌ఫోన్ ఆధారిత వ్యవసాయ సేవల ద్వారా వాతావరణ సమాచారం, మార్కెట్ ధరలు, వ్యవసాయ నిపుణుల సలహాలు రైతులకు అందుబాటులోకి తీసుకురావచ్చని తెలిపారు.

**గిట్టుబాటు ధరే రైతుకు నిజమైన భరోసా**

రైతు పండించిన పంటకు సరైన ధర లభించకపోతే ఎన్ని పథకాలు ఉన్నా రైతు ఆర్థికంగా బలపడలేడని యర్రం వెంకటరెడ్డి అన్నారు. ఉత్పత్తి వ్యయం, మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని రైతుకు న్యాయమైన ధర లభించేలా మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు.

రైతు సమస్యలను కేవలం వ్యవసాయ శాఖకు సంబంధించిన అంశంగా కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థ, ఆహార భద్రత, గ్రామీణ అభివృద్ధికి సంబంధించిన జాతీయ సమస్యగా చూడాలి. రైతు బలపడితేనే గ్రామీణ భారతం బలపడుతుంది.. గ్రామీణ భారతం బలపడితేనే దేశం బలపడుతుంది అని యర్రం వెంకటరెడ్డి స్పష్టం చేశారు.

# ఆచరణ సాధ్యంకాని హామీలతో ప్రజలను మోసం చేశారు

- **కాంగ్రెస్ వైఫల్యాలపై ధ్వజమెత్తిన మాజీ ఎమ్మెల్యే షకీల్**

**బోధన్, నిజామాబాద్ జిల్లా**
**సెప్టెంబర్ 02(డీడీ9 వార్త):**






అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దగా చేయడమే నైజంగా పెట్టుకుందని బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పాలన వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బోధన్ అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అబద్ధపు హామీల చిట్టాతో రూపొందించిన 420 మీటర్ల భారీ ఫ్లెక్సీని ప్రదర్శించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా షకీల్ మాట్లాడుతూ... రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అరచేతిలో వైకుంఠం చూపి ఓట్లు దండుకుందని, వెయ్యి రోజులు గడిచినా ఏ ఒక్క వర్గానికి న్యాయం చేయలేకపోయిందని ధ్వజమెత్తారు. వృద్ధులకు రూ.4 వేల మహిళలకు రూ. 2 వేల 500, వికలాంగులకు రూ.6 వేల పెన్షన్ ఇస్తామని చెప్పి నిలువునా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.12,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారని ఆరోపించారు. రైతాంగానికి రుణమాఫీ, రైతుభరోసా, తులం బంగారం, స్కూటీల హామీలను నీరుగార్చారని, సకాలంలో యూరియా కూడా అందించలేని చేతకాని స్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. నిజాం సాగర్ కాలువలకు నీళ్లు వదలకుండా పంటలను ఎండబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బోధన్ లో నిరుపేదలైన 3,600 ఇళ్లను 22A నిషేధిత జాబితాలో చేర్చి వారి పొట్ట కొట్టేందుకు కుట్ర పన్నుతున్నారని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. పేదల ఇళ్లపై ఒక్క బుల్డోజర్ పడినా రక్తతర్పణానికైనా సిద్ధమే తప్ప ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. తెలంగాణ తెచ్చిన మహానాయకుడు కేసీఆర్ సృష్టించిన సంపదను, పథకాలను చూసి ఓర్వలేక ఆయనపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ దగాకోరు పాలనకు రోజులు దగ్గర పడ్డాయని, ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, సీనియర్ నాయకులు గిరిధర్ గంగారెడ్డి, పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## సుజనాపురం లో పోలీసుల కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

- **అక్రమ గుడుంబా తయారీ కేంద్రాల ధ్వంసం**
- **పత్రాలు లేని వాహనాలు స్వాధీనం**

**సెప్టెంబర్ 2 డిడి 9 వార్త దుమ్ముగూడెం**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలో గల సుజనాపురం గ్రామంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు భద్రాచలం డిఎస్పి అరుణ్ కుమార్ పర్యవేక్షణలో దుమ్ముగూడెం చర్ల పోలీస్ స్టేషన్ల సిబ్బంది సంయుక్తంగా సృజనాపురం గ్రామంలో తెల్లవారుజామున కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్లో గ్రామంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించగా వివిధ ప్రాంతాల్లో గుర్తించిన అక్రమ గుడుంబా తయారీ కేంద్రాలను ధ్వంసం చేశారు అలాగే సరైన చెల్లుబాటు అయ్యే ధృవపత్రాలు లేని వాహనాలను గుర్తించి తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం స్వాధీనం చేసుకున్నారు ఈ సందర్భంగా భద్రాచలం డి.ఎస్.పి గ్రామస్తులకు ఎన్డిపిఎస్ నేరాలు అక్రమ మద్యం గుడుంబా తయారు విక్రయాలు మరియు సైబర్ నేరాల వల్ల కలిగే నష్టాలు వాటికి సంబంధించిన చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా అనుమానాస్పదంగా లేదా చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు అదేవిధంగా గ్రామంలోని యువతకు పోలీస్ ఉద్యోగ నియామక అవకాశాలపై అవగాహన కల్పిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత పోలీస్ ఉద్యోగ శిక్షణ కార్యక్రమాన్ని అర్హులైన అభ్యర్థులకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ నియామక పరీక్షలకు ప్రణాళిక బద్ధకంగా సిద్ధమై మంచి అవకాశాలను అందిపిచ్చుకోవాలని యువతను ప్రోత్సహించారు. కార్యక్రమంలో చర్ల హెచ్ ఎస్ ఓ రాజు వర్మ దుమ్ముగూడెం హెచ్ ఎస్ ఓ వెంకటప్పయ్య ఎస్సైలు నర్సిరెడ్డి కేశవ శ్యాంప్రసాద్ జగన్మోహన్ చారి పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు



## బోరిగాంలో ప్లాస్టిక్ రహిత విప్లవం

- **గ్రామ సభలో సర్పంచ్ కీలక నిర్ణయం**

**ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడా :డిడి9 వార్త**

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల పరిధిలోని బోరిగాం గ్రామ పంచాయతీలో బుధవారం ఉత్సాహభరిత వాతావరణంలో గ్రామ సభ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా, గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ఈ సభలో ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.అనంతరం గ్రామ సర్పంచ్ ఆసిఫ్ ఖాన్ మాట్లాడుతూ.. గ్రామంలో ప్లాస్టిక్‌ను ఒక్కసారిగా పూర్తిగా నిర్మూలించడం సాధ్యం కాకపోయినా, ఈ నిర్ణయం ద్వారా ప్రజల ఆలోచన విధానంలో కొంచెమైనా మార్పు రావాలనే ఉద్దేశంతోనే ఈ అడుగు వేస్తున్నట్లు ప్రకటించారు. ప్లాస్టిక్ వాడకాన్ని దశలవారీగా అరికట్టేందుకు గ్రామ పంచాయతీ సరికొత్త ముందడుగు వేసిందని ఆయన తెలిపారు. ఇకపై గ్రామంలో ఎలాంటి శుభకార్యాలు (ఫంక్షన్లు) జరిగినా, లేదా ఎవరైనా మరణించినా.. సదరు కుటుంబాలపై ఆర్థిక భారం పడకుండా గ్రామ పంచాయతీ తరపునే స్టీల్ లేదా ప్రత్యామ్నాయ పల్లాలు (ప్లేట్లు), గ్లాసులను ఉచితంగా అందజేస్తామని సర్పంచ్ ఆసిఫ్ ఖాన్ వెల్లడించారు. ఈ నిర్ణయం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్లాస్టిక్ రహిత గ్రామంగా బోరిగాంను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## చందర్‌సింగ్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు

**ఆదిలాబాద్ జిల్లా, సొనాల మండలం,**
**డిడి 9 వార్తా:-**

సోనాలా మండలంలోని గుట్టపాక్కతండా గ్రామానికి చెందిన టి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్త చందర్‌సింగ్ స్వర్గస్తులైన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర అబ్జర్వర్ రాథోడ్ బాపూరావు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఈ సందర్భంగా చందర్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించి, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం వారి సతీమణి అనిత గారికి, ఈ కష్టకాలంలో కుటుంబానికి తాను అండగా ఉంటానని, "నేనున్నాను" అంటూ భరోసా కల్పించారు.

చందర్‌సింగ్ మృతి పట్ల రాథోడ్ బాపూరావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

వారివెంటా సోనాలా మండల కన్వీనర్ సాధనంద్ గ్రామ సర్పంచ్ మరియు విద్యాసాగర్ విలాష్ జ్ఞానేశ్వర్ నేరడిగొండ మండల కన్వీనర్ బానోత్ వసంత్ రావు తదితరులు రావడం జరిగింది



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500203. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.